E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

హైదరాబాద్ (తేదీ) 08-02-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక: 38 || పేజీలు–6 www.ekaburu.com




కేంద్రం చర్యల వల్లే బస్తర్‌లో అభివృద్ధి: ద్రౌపదీ ముర్ము

» 3లో



2

## అటు చర్చలు.. ఇటు ఆంక్షలు .. ఇరాన్‌పై ట్రంప్ భిన్న వైఖరి

ఈ కబురు : అమెరికా, ఇరాన్ మధ్య ఒమన్‌లో చర్చలు మొదలైన సంగతి తెలిసిందే. అదే సమయంలో ఇరాన్ చమురుపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించడం గమనార్హం . ఆ దేశంతో ముడిచమురు వ్యాపారం సాగిస్తున్న 15 సంస్థలు, 14 రహస్య నౌకలపై ఈ ఆంక్షలు విధించినట్లు అమెరికా విదేశాంగశాఖ వెల్లడించింది.



6

## కెప్టెన్.. ఏం కొట్టాడయ్యా!

టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య భారత్ శుభారంభం చేసింది. కానీ విజయం అంత తేలిగ్గా ఏమీ దక్కలేదు. మొదట అమెరికా బౌలర్లు విజృంభించడంతో భారత్ ఓటమి ముప్పును ఎదుర్కొంది.



2

## జూన్‌కల్లా యుద్ధం ముగించండి

కీవ్: దాదాపు నాలుగేళ్లుగా కొనసాగుతున్న యుద్ధాన్ని జూన్‌కల్లా ముగించాలని రష్యా, ఉక్రెయిన్‌లకు అమెరికా గడువు విధించింది. ఈ విషయాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. "'ఈ వేసవి ప్రారంభంలోగా యుద్ధాన్ని ముగించాలని అమెరికన్లు ప్రతిపాదిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం యుద్ధం ఆగకపోతే ఉభయపక్షాలపై వారు ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది.




# కేసీఆర్‌ది చెరగని దగా చరిత్ర

- మరో ఎనిమిదేళ్లు రాష్ట్రంలో ఇందిరమ్మ పాలనే
- భాజపాతో భారాస చీకటి ఒప్పందం
- పరిగి శివారు నారాయణపూర్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- విచారణకు పిలిస్తే తప్పేంటి?

ఈ కబురు, సంగారెడ్డి : 'భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చరిత్రను నేను చెరిపేస్తున్నానని ఆ పార్టీ నేతలు వాపోతున్నారు. కానీ ఆయన దగా చరిత్ర నేను చెరిపినా చెరగదు' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి శివారులోని నారాయణపూర్‌లో శనివారం 'ప్రజాపాలన ప్రగతి బాట' సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్న ఈ సభలో సీఎం మాట్లాడుతూ... దళితుణ్ని ముఖ్యమంత్రి చేస్తానని ఆ వర్గాన్ని మోసం చేసిన చరిత్రతోపాటు మూడెకరాల భూమి ఇస్తానని మాటిచ్చి తప్పి.. ఇంటికో ఉద్యోగం ఇస్తామని నిరుద్యోగ యువతను మోసం చేసిన కేసీఆర్ చరిత్రను ఎవరు మార్చగలరని ప్రశ్నించారు. రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇస్తామని నిరుపేదలను మోసం చేసిన చరిత్రను ఎలా తొలగించగలమని అన్నారు.

**పెళ్లి పెద్దను చూసి పిల్లనివ్వగలమా?**

"అసెంబ్లీ, లోక్‌సభ, పంచాయతీ ఎన్నికల్లో ఓటమి పాలైన భారాస.. దొంగచాటుగా పురపాలికల ఎన్నికల్లో విజయం సాధించేందుకు భాజపాతో చీకటి ఒప్పందం చేసుకుంటోంది. ఇటీవల తాండూరుకు చెందిన భాజపా నేతలు కాంగ్రెస్‌లో చేరిన సమయంలో ఆ పార్టీ నేతలే స్వయంగా తమ పార్టీ టికెట్లను భారాస కార్యాలయాల్లో జారీ చేస్తున్నారని చెప్పారు. దీన్నిబట్టే ఆ రెండు పార్టీల కుమ్మక్కు బయటపడుతోంది.

నిబంధనలకు విరుద్ధంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి.. అధికారులు, రాజకీయ నేతలు, న్యాయమూర్తులు, జర్నలిస్టుల ఫోన్లతోపాటు భార్యాభర్తల సంభాషణలు విన్న కేసీఆర్‌ను విచారణకు పిలిస్తే తప్పేంటి? లాక్కెళ్లి విచారణ చేయగల చట్టాలున్నా.. మా పోలీసులు మంచోళ్లు కాబట్టి ఆ పనిచేయలేదు. కేసీఆర్ వయసును గౌరవించి హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో విచారణ చేశారు. తన ఫాంహౌస్‌కు వచ్చి విచారణ చేయాలని ఆయన కోరడం సమంజసమేనా?

తరువాయి 2లో

## విశ్వసనీయతే భారత్‌కు బలమైన కరెన్సీ

### మలేసియాలో ప్రవాసులతో భేటీలో మోదీ



**ఈ కబురు, కౌలాలంపూర్:** విశ్వసనీయతే భారత్‌కు బలమైన కరెన్సీగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. వృద్ధికి నమ్మకమైన వ్యవస్థగా భారత్‌ను ప్రపంచం చూస్తోందని చెప్పారు. బ్రిటన్, యూఏఈ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అమెరికా, ఐరోపా సమాఖ్య (ఈయూ) వంటివాటితో కుదిరిన/ కుదురుతున్న ఒప్పందాల్లో ఇది ప్రతిఫలించిందని చెప్పారు. మలేసియాలో రెండ్రోజుల పర్యటన కోసం శనివారం కౌలాలంపూర్ చేరుకున్న ఆయన.. ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఉమ్మడిగా రూపాంతరీకరణను ముందుకు తీసుకువెళ్లేందుకు భారత్‌మలేసియా భాగస్వామ్యం' (ఇంపాక్ట్) అనేదే ఇరు దేశాలకు మార్గనిర్దేశం చేస్తుందని చెప్పారు. భాగస్వాములుగా రెండు దేశాలూ చేతిలో చేయివేసి నడుస్తున్నాయన్నారు. "భారత్, మలేసియా ఒకదానికొకటి బాగా తెలుసు. భారతీయ భాషల్లో, మలై భాషలో అనేక ఉమ్మడి మాటలు ఉంటాయి. ఇరు దేశాల మధ్య బలమైన వారధిలా ప్రవాస భారతీయులు నిలుస్తున్నారు. ఎంతో ఆత్మీయంగా నాకు స్వాగతం పలికినందుకు రుణపడి ఉంటాను" అని అన్నారు.

**––తమిళం అజరామరం.. అది భారత్ కానుక**

"తమిళనాడు నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడినవారు వేర్వేరు రంగాల్లో సేవలు అందిస్తున్నారు. 2026లో నా మొదటి విదేశీ పర్యటన మలేసియాలో కావడం మరింత ఆనందంగా ఉంది. ప్రస్తుత ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఈ పదవిలోకి రాకముందు నుంచీ మా ఇద్దరి మధ్య స్నేహం ఉంది.

తరువాయి 2లో

## చెయ్యిచ్చిన పార్టీని నమ్మకండి

- తులం బంగారం.. నెలకు రూ.2,500 వస్తున్నాయా?
- ఆ హామీలు అమలైతే కాంగ్రెస్‌కు.. లేదంటే భారాసకు ఓటేయండి
- ఎన్నికల ప్రచారంలో కేటీఆర్



ఈ కబురు, బాన్సువాడ : మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టడం మినహా రాష్ట్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ నాయకులు చేసింది ఏమీ లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి భారాస నేతలపై నిందలు మోపుతూ రాష్ట్ర ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

తరువాయి 2లో

## రాష్ట్రానికి సీఎం రేవంతా? నేనా?

- కేసీఆర్‌పై చర్యలు తీసుకోలేకపోతే ఆయన రాజీనామా చేయాలి
- హార్వర్డ్ వెళ్లొచ్చాక సీఎం భాష మరింత దిగజారింది
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు



ఈ కబురు, హైదరాబాద్: 'కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకునేందుకు నేను అడ్డుపడుతున్నానని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపిస్తున్నారు.. ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి రేవంతా? నేనా?' అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోలేకపోతే రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

తరువాయి 2లో

## భాజపా పాలిత రాష్ట్రాల్లో కులగణన ఎందుకు చేపట్టలేదు?

- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఈ కబురు, కోరుట్ల : రాష్ట్రంలో కులగణన నిర్వహించడం ద్వారా తమ పార్టీ బీసీలకు న్యాయం చేసిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి శనివారం ఆయన జగిత్యాల జిల్లా కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో పాల్గొన్నారు. అనంతరం మెట్‌పల్లిలో ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు.

తరువాయి 2లో

## దేశ క్వాంటమ్ నిర్దేశకులం మనమే

- ఈ ఏడాది డిసెంబరు నాటికి ఏపీలో అందుబాటులోకి తొలి క్వాంటమ్ కంప్యూటర్
- దేశానికి, ప్రపంచానికి 80% పరికరాలు అందించాలన్నదే లక్ష్యం నచ్చిన రంగంలో దూసుకెళ్లండి
- అమరావతి క్వాంటమ్ వ్యాలీ శంకుస్థాపన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు




**ఈ కబురు, అమరావతి:** హైటెక్ సిటీ హైదరాబాద్‌కు గేమ్‌ఛేంజర్‌గా మారితే.. అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ దేశానికి గేమ్‌ఛేంజర్ కానుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

రాజధాని అమరావతిలో 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ (ఏక్యూవీ)' భవన నిర్మాణానికి కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ సహాయమంత్రి జితేంద్రసింగ్‌తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో చంద్రబాబు మాట్లాడారు. 'ప్రపంచశ్రేణి ప్రమాణాలతో నిర్మించే అమరావతి క్వాంటమ్ వ్యాలీ భారత్ క్వాంటమ్ భవిష్యత్తును నిర్దేశించే ప్రదేశంగా మారుతుంది. ఇక్కడి నుంచి క్వాంటమ్ వేగంతో నిర్ణయాలు తీసుకుంటాం. పనులు జరిగేలా చూస్తాం. వచ్చే 40ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇవన్నీ చేపట్టాం. డ్రోన్ సిటీ, ఏరోస్పేస్, మెడ్‌టెక్, స్పేస్ సిటీ లాంటివి రాష్ట్రంలో అందుబాటులోకి తెస్తున్నాం. డిఫెన్స్, హెల్త్‌కేర్, ఎనర్జీ, ఫైనాన్స్, క్లైమేట్ మోడలింగ్‌కు అమరావతి క్వాంటమ్ వ్యాలీలో పరిశోధనలు, ఆవిష్కరణలు జరుగుతాయి. ఈరోజు క్వాంటమ్ వ్యాలీ భవనాలకే కాదు.. అంతర్జాతీయ క్వాంటమ్ విప్లవంలో భాగమయ్యేనిపుణులకూ పునాది వేసుకుంటున్నాం.

తరువాయి 2లో



## నెహ్రూ వల్లే చైనా చేతిలో ఓడిపోయాం

- నిజాలున్నా 'బ్రూక్స్-భగత్' నివేదికపై మేం రాజకీయం చేయలేదు: రిజిజు వెల్లడి

**ఈ కబురు, దిల్లీ:** లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన ఆర్మీ మాజీ చీఫ్ ఎం.ఎం.నరవణె పుస్తకం వ్యవహారాన్ని తిప్పికొడుతూ కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కీలక వ్యాఖ్యలు చేశారు. 1962 యుద్ధంలో చైనా చేతిలో భారత్ ఘోర ఓటమికి నాటి నెహ్రూ ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలే కారణమనే అంశం 'హెండెర్సన్ బ్రూక్స్‌భగత్' నివేదికలో ఉందని తెలిపారు. ఈ విషయం తెలిసినప్పటికీ ఆ నివేదికను అధికార రహస్యంగానే ఉంచాలని మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని రిజిజు చెప్పారు.

తరువాయి 3లో

## వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం

- మధ్యంతర ఒడంబడికపై సంతకాలకు ఫ్రేమ్‌వర్క్ ఖరారు
- భారత్, అమెరికా సంయుక్త ప్రకటన
- మార్చిలో జరగనున్న సంతకాలు
- వెంటనే భారత్‌పై అదనపు సుంకాలను ఎత్తేసిన ట్రంప్
- మేక్ ఇన్ ఇండియా బలోపేతం: ప్రధాని

తరువాయి 3లో

ఈ కబురు,వాషింగ్టన్, న్యూయార్క్: మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి భారత్, అమెరికా శ్రీకారం చుట్టాయి. ఇందుకు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేశాయి. ఈ విషయాన్ని శనివారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో రెండు దేశాలు వెల్లడించాయి. తొలి దశలో కుదుర్చుకోనున్న ఈ ఒప్పందంపై మార్చిలో సంతకాలు జరగనున్నాయి. దీనివల్ల రెండు దేశాల మధ్య పలు ఉత్పత్తులపై సుంకాలు సున్నా స్థాయికిగానీ, గణనీయంగాగానీ తగ్గనున్నాయి.



## కేసీఆర్‌ది చెరగని దగా చరిత్ర




భాజపా నాయకులు మున్సిపల్ ఎన్నికల్లో కూడా ప్రధాని మోదీని చూసి ఓట్లేయాలని అడుగుతున్నారు. పెళ్లి పెద్దను చూసి పిల్లనిస్తే సంసారం ఆగమవుతుంది. పెళ్లికొడుకు గుణాలు చూసి పిల్లనిస్తేనే కాపురం బాగుంటుంది. మోదీని చూసి ఓటేస్తే స్థానిక సమస్యలు ఎలా పరిష్కారమవుతాయి? దిల్లీలో యమునా రివర్ ఫ్రంట్ పేరిట యమునా నదిని, గుజరాత్‌లో సబర్మతి, ఉత్తర్‌ప్రదేశ్‌లో గంగా నదిని భాజపా ప్రభుత్వాలు శుద్ధి చేశాయి. ఇక్కడ మూసీ నదిని ప్రక్షాళన చేస్తామంటే భాజపా, భారాస నాయకులు మోకాలడ్డుతున్నారు. ఐదేళ్లు పరిపాలించేందుకు ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే.. భారాస, భాజపా నాయకులు మమ్మల్ని రెండేళ్లు పూర్తికాగానే దిగిపొమ్మంటున్నారు. వారికి సవాల్ విసురుతున్నా.. మిగిలి ఉన్న మూడేళ్లతో పాటు మరో ఐదేళ్లు.. అంటే వచ్చే ఎనిమిదేళ్లు రాష్ట్రంలో ఇందిరమ్మ పాలనే ఉంటుంది. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్‌దే విజయం.

మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ యువతకు 70 వేల ఉద్యోగాలిచ్చాం. 15 ఏళ్ల తర్వాత గ్రూప్1 ఉద్యోగాలు భర్తీ చేశాం. బీసీలు, దళితులు, గిరిజనులు, ఆదివాసీలకు గ్రూప్1 ఉద్యోగాలు వస్తే జీర్ణించుకోలేక కొందరు కోర్టుల్లో కేసులు వేశారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పిన కేసీఆర్.. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారు. రూ.లక్ష కోట్ల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం మూడేళ్లలోనే కూలేశ్వరంగా మారింది. దోపిడీ చేసిన నిధులతో ఎర్రవల్లిలో కేసీఆర్, జన్వాడలో కేటీఆర్, శంకర్‌పల్లిలో కవిత, మొయినాబాద్‌లో హరీశ్‌రావులు ఫాంహౌస్‌లు నిర్మించుకున్నారు.

--ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై కేసీఆర్ కక్ష సాధింపు

గోదావరిలో ఏటా 3 వేల టీఎంసీలు వృథాగా పోతున్నాయని భారాస అధినేత కేసీఆర్ స్వయంగా అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చి చెప్పారు. ఆంధ్రాలో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు గోదావరి జలాలను తరలించుకోవాలని ఏపీకి సూచించారు. ఏపీ మాజీ మంత్రి రోజా ఇంట్లో భోజనం చేస్తూ రాయలసీమను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసుకోవాలని కేసీఆర్ సలహా ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో సమైక్య పాలకులు ప్రతిపాదించిన ప్రాణహితచేవెళ్ల పనులను వికారాబాద్ వరకు పొడిగించాలని నిర్దేశించినా.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై కక్షతో కేసీఆర్ ఆ పనులను పక్కన పెట్టారు. 300 టీఎంసీల గోదావరి జలాలను రంగారెడ్డికి తరలిస్తే సస్యశ్యామలం అయ్యేది. రాష్ట్రం అంతటికీ వడ్డించేది.. సమకూర్చేది మేమే కాబట్టి పుర ఎన్నికల్లో పొరపాటున ఇతర పార్టీలకు ఓటేస్తే ఇబ్బందులొస్తాయి. బల్దియాలను పదేళ్లపాటు భారాస నేతలే పాలించారు. వాళ్లు సమస్యల్ని పరిష్కరించి ఉంటే.. ఇప్పుడు ప్రజలే పిలిచి వారికి ఓట్లేసేవారు. ప్రస్తుతం గల్లీల్లో సమస్యలు.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా.. ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి.

--రంజిత్‌రెడ్డిని మంత్రిని చేస్తాం

చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చి.. పురపాలక సంఘాలను అభివృద్ధి చేసే ప్రత్యేక బాధ్యతలు అప్పగిస్తాం. ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తా. కేసీఆర్ ప్రభుత్వంలో బతుకమ్మ చీరలు ఇస్తే ధరించడానికి పనికిరావని... పంట పొలాలకు రక్షణగా కట్టుకునేవారు. మా ప్రభుత్వం పంపిణీ చేసిన ఇందిరమ్మ చీరలు కట్టుకున్న ఆడపడుచులు పాలపిట్టల్లా మెరిసిపోతున్నారు'' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా... వికారాబాద్ జిల్లాలోని మహిళా స్వయంసహాయక సంఘాలకు రూ. 567.69 కోట్ల స్త్రీ నిధి రుణాల చెక్కును సీఎం అందజేశారు. సభలో శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కె.సుజాత, వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## చెయ్యిచ్చిన పార్టీని నమ్మకండి



శనివారం ఆయన కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడ, బిచ్కుంద, ఎల్లారెడ్డి పట్టణాల్లో మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలకు చెయ్యి ఇచ్చిన పార్టీ, చెవిలో పూలు పెట్టే పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. ''420 అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఒక్కటైనా నెరవేర్చిందా? తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2,500, రైతుభరోసా, స్కూటీలు వచ్చాయా? ఇవి వచ్చిన వారు కాంగ్రెస్‌కు.. రాని వారు భారాసకు ఓటేయాలి. బతుకమ్మ చీరలు, మైనార్టీలకు తోఫాలు ఇవ్వని కాంగ్రెస్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. మహిళలకు ఉచిత బస్సు పెట్టి పురుషులకు డబుల్ టికెట్ తీసుకుంటున్నారు. గతంలో రేవంత్‌రెడ్డి బాన్సువాడకు వచ్చి ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని దూషించారు. అయినా పోచారం అదే పార్టీలోకి వెళ్లారు. ఆయనకు భారాస హయాంలో మంత్రి, సభాపతి పదవులు ఇచ్చి గౌరవిస్తే... పార్టీ మారి కేసీఆర్‌ను, ఓటేసిన ప్రజలను మోసగించారు. ఆయన ఎందుకు కాంగ్రెస్‌లోకి వెళ్లారో? ఈ ప్రభుత్వంలో ఎన్ని నిధులు తీసుకొచ్చారో చెప్పాలి. ధైర్యం ఉంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. ఉప ఎన్నికలో ప్రజలే వారి భవితవ్యం ఏంటో తేలుస్తారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు స్టీల్ బిందెలను పంపిణీ చేశారు. వాటిని చూసి మహిళలు ఓట్లు వేసి మోసపోయారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డికి హైదరాబాద్‌లో లంకెబిందెలు దొరుకుతున్నాయి'' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎల్లారెడ్డి పోలీసులు అధికార పార్టీకి అండగా నిలుస్తున్నారని, తీరు మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, హన్మంత్‌షిండే, జాజాల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అటు చర్చలు.. ఇటు ఆంక్షలు

### .. ఇరాన్‌పై ట్రంప్ భిన్న వైఖరి




ఈ చమురు వ్యాపారం నుంచి వస్తున్న ఆదాయాన్ని విదేశాల్లో ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడానికి, తమ పౌరులను అణచివేయడానికి ఇరాన్ ఉపయోగిస్తోంది. అందుకే వారి ఆదాయ మార్గాలను అడ్డుకునేందుకు ఆంక్షలు విధిస్తున్నాం'' అని విదేశాంగ శాఖ ప్రకటించింది. ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులు, పెట్రోకెమికల్ ఉత్పత్తులకు సంబంధించిన వ్యాపార నెట్‌వర్క్‌పై అమెరికా తన చర్యలు కొనసాగిస్తుందని పేర్కొంది. ఇదిలా ఉంటే.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నవేళ ఒమన్ వేదికగా అమెరికా ప్రతినిధులతో మొదలైన చర్చలను 'చాలా మంచి ఆరంభం'గా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ అభివర్ణించారు. అణు కార్యక్రమంపై భవిష్యత్ సంప్రదింపులకు బాటలు పరచడం పైనే ప్రాథమికంగా తాము దృష్టిసారించినట్లు చెప్పారు.

**–ట్రంప్ హెచ్చరికలు..**

**తమతో అణుఒప్పందం కుదుర్చుకునేలా ఇరాన్‌పై అమెరికా (USA) ఒత్తిడి కొనసాగుతోంది. ఒకవేళ డీల్ కుదరకపోతే.. పరిణామాలు ఎలా ఉంటాయో ఆ దేశానికి తెలుసని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఒప్పందం కుదుర్చుకోవడానికి టెహ్రాన్ ఆసక్తిగా ఉందన్నారు. ఆ దేశం వైపు తమ నౌకాదళం కదులుతుందని, అది అక్కడికి చేరుకున్న తర్వాత ఎలా పనిచేస్తుందో చూద్దామంటూ పరస్పర భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకోవడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయకూడదనే షరతును పునరుద్ఘాటించారు.**

## జూన్‌కల్లా యుద్ధం ముగించండి



జూన్ నాటికి అన్ని వ్యవహారాలను ముగించాలని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఉభయపక్షాల నుంచి ఓ స్పష్టమైన కార్యాచరణను కూడా వారు కోరుతున్నారు'' అని జెలెన్‌స్కీ శుక్రవారం తెలిపారు. తదుపరి రౌండ్ చర్చలకు అమెరికా ఆతిథ్యమివ్వనుందని, ఈ త్రైపాక్షిక చర్చలు మయామీలో జరిగే అవకాశం ఉందని అన్నారు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇటీవల అబుధాబీలో రష్యా, ఉక్రెయిన్ మధ్య చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఇందులో ఎలాంటి పురోగతి సాధించలేదు. రెండు దేశాలు తమ డిమాండ్ల నుంచి వెనక్కి తగ్గలేదు. డాన్‌బాస్ ప్రాంతం నుంచి ఉక్రెయిన్ తమ దళాలను ఉపసంహరించుకోవాలని రష్యా డిమాండ్ చేస్తోంది. దాన్ని ఎప్పటికీ అంగీకరించబోమని కీవ్ అంటోంది. ''క్లిష్టమైన అంశాలు అలానే ఉన్నాయి. డాన్‌బాస్‌పై మా వైఖరిని మరోసారి స్పష్టం చేశాం. మా విధానంలో ఎలాంటి మార్పు లేదు. రష్యా నియంత్రణలోని జపోరిజియా అణుకేంద్రాన్ని ఎవరు నిర్వహించాలన్న అంశంపైనా ఇంకా స్పష్టత రాలేదు. డాన్‌బాస్‌ను స్వేచ్ఛా వాణిజ్య మండలంగా మార్చాలని అమెరికా ప్రతిపాదిస్తోంది. ఇది అమలవుతుందా లేదా అన్నది నాకు తెలియదు. ఎందుకంటే దీనిపై మాకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయి'' అని జెలెన్‌స్కీ చెప్పారు.

## దేశ క్వాంటమ్ నిర్దేశకులం మనమే



ఇప్పటివరకు అంతా అమెరికాలోని సిలికాన్ వ్యాలీ గురించి మాట్లాడేవారు. ఇకపై అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీ గురించి మాట్లాడుకుంటారు' అని పేర్కొన్నారు.

--తొలి కంప్యూటర్ వచ్చేది ఈ ఏడాదే

'సాంకేతికత గొప్పదనాన్ని అందిపుచ్చుకునే ప్రధాని మనకు ఉండడం అదృష్టం. క్వాంటమ్ మిషన్ కార్యకలాపాలు ఏపీ నుంచే ప్రారంభం కావాలని కోరగానే సహకరించారు. అతి తక్కువ సమయంలోనే క్వాంటమ్ కంప్యూటర్ ఏపీలో ఏర్పాటుచేయడానికి ముందుకొచ్చిన టీసీఎస్, ఐబీఎం, ఎల్అండ్‌టీ సంస్థలకు ధన్యవాదాలు. ఈ ఏడాది ఏప్రిల్ 14న అంతర్జాతీయ క్వాంటమ్ డే రోజున రెండు స్వదేశీ క్వాంటమ్ కంప్యూటర్లను రిఫరెన్స్ ఫెసిలిటీగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నుంచి ప్రారంభించబోతున్నాం. డిసెంబర్ నుంచి రాష్ట్రంలో తొలి క్వాంటమ్ కంప్యూటర్ అందుబాటులోకి తెస్తాం. 85% క్వాంటమ్ కంప్యూటింగ్ పరికరాలు ఇక్కడే తయారుచేసి అంతర్జాతీయ మార్కెట్లకూ సరఫరా చేయాలన్నదే మా ఆలోచన' అని తెలిపారు.

--ఏఐ లివింగ్ ల్యాబ్ విశ్వవిద్యాలయం

ఐఎస్‌బీ తరహాలో ఏఐ లివింగ్ ల్యాబ్ యూనివర్సిటీ ప్రారంభించాలని ఆలోచిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. 'ఏఐ, క్వాంటమ్ ఏఐలలో కోర్సులు అందించేలా అమరావతిలో యూనివర్సిటీ ఏర్పాటుచేస్తాం. ప్రజలందరికీ ఏఐ సాంకేతికత చేరాలన్నదే మా ఆలోచన. క్వాంటమ్‌తో కూడిన లాజిస్టిక్ ద్వారా వ్యయం తగ్గుతుంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో వినియోగిస్తే రిస్క్ తగ్గుతుంది. విద్యుత్తు ఉత్పత్తి రంగంలో దీని వినియోగం ద్వారా అతి తక్కువ ఖర్చుతో ఉత్పత్తి, పంపిణీ సాధ్యమవుతాయి. అమరావతి డీప్‌టెక్ ప్రయాణంలో భాగస్వాములు కావాలని పరిశ్రమలు, విద్యా రంగం, విద్యార్థులకు పిలుపునిస్తున్నా' అన్నారు.

--ఐటీని విమర్శించినోళ్ల పిల్లలు ఐటీలో స్థిరపడ్డారు

గతంలో ఐటీ, సెల్‌ఫోన్ల గురించి మాట్లాడితే తనను విమర్శించినవారి పిల్లలంతా ఐటీ రంగంలో అమెరికాలో స్థిరపడ్డారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'వచ్చే 3040 ఏళ్లలో ఆచరణలోకి వచ్చే అంశాలపైనే నేనెప్పుడూ ఆలోచిస్తా. దానికి అనుగుణంగానే ప్రణాళికలు ఉంటాయి. ఐటీపై పూర్తి అవగాహన ఉన్నందునే లోకేశ్‌కు ఆ శాఖ బాధ్యతలు అప్పగించాను. పని పట్ల నిబద్ధతకు పెట్టిందిపేరు ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ కామకోటి. 16న అమరావతికి బిల్‌గేట్స్ వస్తున్నారు. భవిష్యత్తు అవసరాలు దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర అభివృద్ధికి సుస్థిర ప్రణాళికలతో ముందు కెళ్తున్నాం' అని చంద్రబాబు తెలిపారు.

--2030 నాటికి 2.50 లక్షల మంది నిపుణులు అవసరం

క్వాంటమ్ ద్వారా చేసిన ఆవిష్కరణకు నోబెల్‌ప్రైజ్ సాధిస్తే రూ.100 కోట్ల నజరానా ఇస్తామని ప్రకటించినట్లు సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. 'యువ మేధావులు పరిశోధనలు చేయాలి. 2030 నాటికి 2.5 లక్షల మంది క్వాంటమ్ నిపుణులు అవసరమని అంచనా. దేశంలోని ఐటీ నిపుణుల్లో 35% తెలుగువాళ్లే. క్వాంటమ్ కోర్సుల్లో శిక్షణకు పిలుపునిస్తే 50వేల మంది వచ్చారు. దశలవారీగా 35 లక్షల మందికి శిక్షణ ఇప్పిస్తాం. ఐఐటీ మద్రాస్ అడ్వాన్స్‌డ్ క్వాంటమ్ కోర్సులు అందించినప్పుడు దేశవ్యాప్తంగా 2.08 లక్షల మంది విద్యార్థులు రిజిస్టరైతే వారిలో సగం మంది ఆంధ్రప్రదేశ్ వారే. క్వాంటమ్ ఏఐ, సైబర్ సెక్యూరిటీలో ప్రపంచవ్యాప్తంగా 50 లక్షల మందికి శిక్షణ ఇచ్చేందుకు ఐబీఎం ముందుకొచ్చింది. అందులో 10లక్షల మంది ఏపీకి చెందిన యువత ఉండేలా ఒప్పందం చేసుకున్నాం. రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థులపైనే ఆధారపడి ఉంది. మన యువత సాంకేతిక రంగంలో క్వాంటమ్ వేగంతో దూసుకెళ్తోంది. కుప్పంలో ఏడోతరగతి విద్యార్థి ఏఐతో ఆరోగ్య పరీక్షలు చేశాడు. రాష్ట్రంలోని 50 లక్షల మంది యువత ఏఐ నేర్చుకుని అద్భుతాలు సృష్టించాలి. ఏపీలో విద్యార్థులంతా ఏఐ ఆల్గరిథమ్స్‌లో శిక్షణ పొందాలి' అని సీఎం పిలుపునిచ్చారు.

## విశ్వసనీయతే భారత్‌కు బలమైన కరెన్సీ



**తమిళ పాటలన్నా, దిగ్గజ నటుడు ఎంజీ రామచంద్రన్ అన్నా ఆయనకు ఇష్టం. తమిళం అనేది ప్రపంచానికి భారత్ ఇచ్చిన కానుక. తమిళ సాహిత్యం అజరామరం. తమ ప్రతిభతో తమిళులు మానవాళికి సేవలందిస్తున్నారు. ప్రస్తుత ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, కేంద్రమంత్రులు జైశంకర్, నిర్మలా సీతారామన్, ఎల్.మురుగన్ ఆ రాష్ట్రానికి చెందినవారే. తిరువళ్లువర్ పీఠాన్ని, కొత్త కాన్సులేట్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తాం. ప్రవాస భారతీయుల్లో ఆరో తరం వరకు 'ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఇండియా' (ఓసీఐ) కార్డు జారీ చేయాలనే చరిత్రాత్మక నిర్ణయాన్ని ఇటీవలే తీసుకున్నాం. భారత్ విజయం మలేసియా విజయం. అది ఆసియా విజయం కూడా'' అని మోదీ చెప్పారు. పలు భాషల్లో ఆయన అభివాదం చేశారు. మలేసియా ప్రధాని ఇబ్రహీం, ఇద్దరు మంత్రులు విమానాశ్రయానికి వచ్చి ఆయనకు ఘన స్వాగతం పలికారు. భరతనాట్యం, కథకళి, కూచిపూడి, ఒడిస్సీ తదితర శాస్త్రీయ నృత్యాలతో 800 మంది కళాకారులు మోదీని స్వాగతించడం 'మలేసియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో నమోదైంది. ఇద్దరు ప్రధానులు ఒకే కారులో సభాస్థలి వరకు ప్రయాణించారు.**

**––మోదీ నా గొప్ప మిత్రుడు**

**గొప్ప మిత్రుడు మోదీ రావడం ఎంతో ఆనందదాయకమని ఇబ్రహీం అన్నారు. వాణిజ్య ఒప్పందాలు కుదరడానికంటే ముందునుంచీ రెండు దేశాల మధ్య బలమైన బంధాలు ఉన్నాయని చెప్పారు. మోదీకి, భారత్‌కు వ్యక్తిగత మిత్రునిగా ఉంటున్నందుకు గర్విస్తున్నానన్నారు. మోదీ, ఇబ్రహీం ఆదివారం వివిధ అంశాలపై చర్చలు జరిపి, ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. వివాదాస్పద మత ప్రబోధకుడు జకీర్ నాయక్ అప్పగింత గురించి భారత బృందం పట్టుబట్టే అవకాశం ఉంది.**

## రాష్ట్రానికి సీఎం రేవంతా? నేనా?



శనివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ''కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి 26 నెలలు గడుస్తున్నా.. ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీలను అమలు చేయలేదు. మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు భారాస, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉంది. అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగంలో రెండు పార్టీల మధ్య ఏమాత్రం తేడాలేదు. రాష్ట్రానికి కేసీఆర్, రేవంత్‌రెడ్డిలు సీఎంలుగా పనిచేయడం దురదృష్టకరం. నాడు కేసీఆర్ తన అసమర్థతను కేంద్రంపై నెట్టారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి సైతం అదే పనిచేస్తున్నారు. సీఎం ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నట్టుగా మాట్లాడుతున్నారు. ఈ మధ్య హార్వర్డ్ వెళ్లొచ్చాక సీఎం భాష మరింత దిగజారింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై అనేక ఆరోపణలు చేశారు. ఇప్పుడు కేసీఆర్ మీద ఈగ వాలకుండా కాపాడుతున్నారు. కిషన్‌రెడ్డి చర్యలు తీసుకోవడం లేదంటూ మా భుజాలపై బందూకులు పెట్టి బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారు. కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకోకుండా రేవంత్‌రెడ్డిని ఎవరు ఆపుతున్నారు? రాహుల్‌గాంధీ ఆపుతున్నారా? మోదీని ఎదుర్కొనేందుకు కేసీఆర్, సోనియా కుటుంబాలు కుమ్మక్కయ్యాయి. రాహుల్‌గాంధీ ఆదేశాలన్నీ రేవంత్‌రెడ్డి పాటిస్తారు. మరి కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని రేవంత్‌ను రాహుల్‌గాంధీ ఎందుకు ఆదేశించడం లేదు? కాళేశ్వరం అవినీతి విషయంలో నన్ను ప్రశ్నించే నైతిక హక్కు రేవంత్‌రెడ్డికి లేదు. కేసీఆర్‌ను జైలుకు పంపిస్తానని రేవంత్‌రెడ్డి అన్నారు. అవన్నీ ఉత్తుత్తి మాటలే. మంత్రివర్గ సహచరులు వివిధ ప్రాజెక్టులు, కాంట్రాక్టుల విషయంలో కుమ్ములాటలకు దిగుతున్నారు. ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందినందునే సీఎం ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. అభివృద్ధి గురించి చెప్పాల్సిన సీఎం ముస్లింలకు మతపరమైన రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్నారు. నాడు భారాస సర్కారును, ఇప్పుడు రేవంత్ ప్రభుత్వాన్ని అసదుద్దీన్ ఒవైసీ నడిపిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడింది. బీసీలున్న చోట ఎస్సీలకు, ఎస్సీలున్నచోట బీసీలకు, ఎస్టీలకు రిజర్వేషన్లు ఇచ్చి సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కింది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఆ ల్యాబ్‌లో ఓటుకు నోటు కేసు, ఫోన్‌ట్యాపింగ్ కేసుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం ప్రకటన విడుదల చేయాలి'' అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్యాణ్‌నాయక్, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్, అధికార ప్రతినిధి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## భాజపా పాలిత రాష్ట్రాల్లో కులగణన ఎందుకు చేపట్టలేదు?



బీసీలకు అన్యాయం చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి యత్నిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఖండిస్తున్నా. భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బీసీ కులగణన ఎందుకు చేయలేదో జవాబు చెప్పాలి. నిధుల కేటాయింపులో తెలంగాణపై కేంద్రం వివక్ష కనబరుస్తోంది. పుర ఎన్నికల్లో భాజపా, భారాసలకు ఓటు వేస్తే మురుగు కాల్వలో వేసినట్లే. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లను గెలుచుకుంటుంది' అని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందయ్య, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు, నాయకులు కృష్ణారావు, జెట్టి లింగం పాల్గొన్నారు.

# కెసిఆర్ పాలనను గుర్తుచేసుకుంటున్న రాష్ట్ర ప్రజలు కొమిరిశెట్టి సాయిబాబా



ప్రచారంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి సాయిబాబా



శంకర్ పల్లి లో ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

**ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి శంకర్ పల్లిలో ప్రచారం**

ఈకబురు, శేరిలింగంపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని, ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థులకు బ్రహ్మరథం పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి శంకర్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో కొమిరిశెట్టి సాయిబాబా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు స్వచ్ఛందంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన జాతిపితగా కెసిఆర్ ముఖ్యమంత్రిగా పదేళ్లపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లారని అన్నారు. కానీ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ముఖ్యంగా ప్రజల సమస్యలను గాలికి వదిలేసి రాజకీయ కక్ష సాధింపుపై కాంగ్రెస్ పార్టీ దృష్టి పెట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని కుట్రలు పన్నినా.. రాష్ట్ర ప్రజలు మాత్రం బీఆర్ఎస్ పార్టీ వెన్నంటి ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా బీఆర్ఎస్ పార్టీని అఖండ విజయంతో గెలిపించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి కర్రు కాల్చి వాతపెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాగం జంగయ్య యాదవ్, దారుగుపల్లి నరేష్, రాజు ముదిరాజ్, నాగపూరి అశోక్ యాదవ్, శామ్లెట్ శ్రీనివాస్, దారుగుపల్లి పరమేష్, నరేష్, నరేష్ సింగ్, భాస్కర్, అజయ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# గచ్చిబౌలి డివిజన్ లో రూ.10.65 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**మౌలిక వసతుల కల్పనలో గచ్చిబౌలిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నాం : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలి డివిజన్ పరిధిలో 10.65 కోట్ల రూపాయల భారీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. డివిజన్ వ్యాప్తంగా చేపట్టనున్న వరద నీటి కాలువ, సీసీ రోడ్లు, స్పోర్ట్స్ థీమ్ పార్క్, కమ్యూనిటీ హాల్, బంజారా స్మశాన వాటిక, అవుట్ డోర్ ఓపెన్ జిమ్ నిర్మాణ పనులకు తెలంగాణ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో కలిసి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్ సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా భారీ ఎత్తున అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. గత ఐదు సంవత్సరాలలో గచ్చిబౌలి డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా కోట్ల రూపాయల నిధులు వెచ్చించి, మంచినీరు,భూగర్భ డ్రైనేజి పైప్ లైన్, కరెంటు సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, పార్కులు, క్రీడా సదుపాయాలు వంటి మౌలిక వసతులను విస్తృతంగా కల్పించామని తెలిపారు. ప్రతి కాలనీ సమస్యను ప్రత్యక్షంగా తెలుసుకొని, అధికారులు-ప్రజల సమన్వయంతో శాశ్వత పరిష్కారాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. శరవేగంగా విస్తరిస్తున్న గచ్చిబౌలి డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా నిలుపుతున్నామని అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డివిజన్ పరిధిలో శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. సమస్యలను ఒక్కొకటిగా అధిగమిస్తూ శాశ్వత పరిష్కారం చూపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

**శంకుస్థాపన చేసిన పనులు...**

గుల్మోహర్ పార్క్ కాలనీ లో 1కోటి 91 లక్షలతో వరద నీటి కాలువ, నల్లగండ్లలో 35 లక్షలతో సీసీ రోడ్లు, హుడా కాలనీలో 50 లక్షలతో సీసీ రోడ్లు, హుడా కాలనీలో 2 కోట్లతో స్పోర్ట్స్ థీమ్ పార్క్, 25 లక్షలతో సీసీ రోడ్లు, సాయి రామ్ నగర్ కాలనీతో పాటు గజానంద్ సొసైటీలో 74 లక్షలతో సీసీ రోడ్లు ,గోపనపల్లి మంజీర డైమండ్స్ హైట్స్ లో 25 లక్షలతో సీసీ రోడ్లు, గోపనపల్లి తండాలో 30 లక్షలతో కమ్యూనిటీ హాల్, గోపనపల్లి తండాలో 30 లక్షలతో బంజారా స్మశాన వాటిక, ఎన్టీఆర్ నగర్ కాలనీలో 30 లక్షలతో సీసీ రోడ్లు, సోఫా కాలనీ కాలనీలో 46 లక్షలతో సీసీ రోడ్లు, గౌలిదొడ్డిలో 52 లక్షలతో గచ్చిబౌలి డివిజన్ వార్డు కార్యాలయం, గౌలిదొడ్డి కేశవ నగర్ లో 96.50 లక్షలతో సీసీ రోడ్లు, నానక్ రామ్ గుడలో 48 లక్షలతో సీసీ రోడ్లు, మధురానగర్ లో 24 లక్షలతో సీసీ రోడ్లు, రాయదుర్గంలో 48 లక్షలతో సీసీ రోడ్లు, వినాయక్ నగర్ లో 17 లక్షలతో అవుట్ డోర్ ఓపెన్ జిమ్ పనులకు శంకుస్థాపన చేశారు.

# వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం

ఫ్రేమ్‌వర్క్‌పై సంయుక్త ప్రకటన వెలువడటానికి ముందు భారత్‌పై విధించిన 25 శాతం అదనపు సుంకాలను ఎత్తివేస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు. ఈ నిర్ణయం మాత్రం శనివారం నుంచి అమల్లోకి వచ్చిందని శ్వేతసౌధం ప్రకటించింది. దీనికి ప్రతిగా రష్యా నుంచి ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ చమురును కొనుగోలు చేయబోమని భారత్ హామీ ఇచ్చిందని స్పష్టం చేసింది. మధ్యంతర ఒప్పంద ఫ్రేమ్‌వర్క్ ఖరారును ప్రధాని మోదీ స్వాగతించారు. దీనివల్ల మేక్ ఇన్ ఇండియా బలోపేతం అవుతుందని, యువత, మహిళలకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.

'మధ్యంతర ఒప్పంద ఫ్రేమ్‌వర్క్‌ను అమెరికా, భారత్ అంగీకరించాయి. ఇది ఇరువురికి ప్రయోజనకరం' అని సంయుక్త ప్రకటన వెల్లడించింది.

భారీ ప్రయోజనం

మధ్యంతర ఒప్పందం అమల్లోకి వస్తే భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులు, ఉత్పత్తులపై సుంకాలు సున్నా శాతం నుంచి 18 శాతం వరకూ అమలవుతాయి. ప్రస్తుతం అదనపు సుంకాలతో కలిసి 50శాతం ఉన్నాయి. శుక్రవారం 25శాతం అదనపు సుంకాలను ఎత్తి వేయడంతో 25 శాతానికి తగ్గాయి. అవి మరింత తగ్గనున్నాయి. కొన్నింటిపై సున్నా స్థాయికి చేరనున్నాయి. అమెరికా నుంచి భారత్‌కు వచ్చే ఉత్పత్తులపైనా సుంకాలు సున్నాగానీ, స్వల్పంగాగానీ ఉండనున్నాయి. అమెరికా పారిశ్రామిక ఉత్పత్తులు, ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులైన ఎండు ధాన్యాలు, పశువుల దాణాగా వాడే ఎర్ర జొన్నలు, ట్రీ నట్స్, తాజా, ప్రాసెస్డ్ పండ్లు, సోయాబీన్ ఆయిల్, వైన్, ఆల్కహాల్‌పై సుంకాలు సున్నాగానీ, స్వల్పంగాగానీ ఉంటాయి.

భారత్, అమెరికా సంయుక్త ప్రకటన ప్రకారం.. రూ.45.29 లక్షల కోట్ల ఇంధన ఉత్పత్తులు, విమానాలు, విమాన విడి భాగాలు, విలువైన లోహాలు, టెక్నాలజీ ఉత్పత్తులు, కోకింగ్ బొగ్గు వంటి వాటిని దీర్ఘకాలంలో అమెరికా నుంచి భారత్ కొనుగోలు చేయనుంది.

ప్రధాని ప్రశంస

మధ్యంతర ఒప్పందం ఫ్రేమ్‌వర్క్ ఖరారు కావడంతో రైతులు, వ్యాపారులకు కొత్త అవకాశాలు లభిస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యువతకు, మహిళలకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని తెలిపారు. భారత్‌తో బంధానికి కట్టుబడి ఉన్న ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యంతర ఒప్పందం ఫ్రేమ్‌వర్క్ ఖరారుతో భారతీయ ఎగుమతిదారులకు 30 ట్రిలియన్ డాలర్ల వ్యాపారానికి ద్వారాలు తెరుచుకుంటాయని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలవారు, రైతులు, మత్స్యకారులు లబ్ధి పొందుతారని వివరించారు. గ్రామీణ ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేలా.. పాలు, పాల ఉత్పత్తులు, చీజ్, మొక్కజొన్న, గోధుమ, బియ్యం, సోయా, కోళ్లు, ఇథనాల్ (ఇంధనం), పొగాకు, కొన్ని కూరగాయలు, మాంసం, గింజ ధాన్యాలు, జొన్నలు, సిరి ధాన్యాలు, రాగులు, తోటకూర, అరటి పండ్లు, స్ట్రాబెర్రీలు, చెర్రీలు, నిమ్మజాతి పండ్లపై సుంకాలు కొనసాగుతాయని వెల్లడించారు. ఇంకా గ్రీన్ పీస్, కాబులీ శనగ, పెసర్లు, ఆయిల్ సీడ్స్, పశువుల దాణా, వేరుశనగ, తేనె, బార్లీ, వంటి ఉత్పత్తులు, ఆల్కహాల్ రహిత పానీయాలు, పిండి, గంజి, నిత్యావసర చములపైనా సుంకాలను భారత్ కొనసాగించనుంది.

ఒప్పందంలోని ముఖ్యాంశాలు..

తొలి దశలో భాగంగా భారత్ నుంచి ఎగుమతయ్యే రూ.3,98,536 కోట్ల ఉత్పత్తులపై సున్నా ప్రతీకార సుంకాలు అమలవుతాయి.

రూ.2,71,729 కోట్ల ఉత్పత్తులపై 18శాతం సుంకాలు అమలవుతాయి.

రూ.1,08,691 కోట్ల విలువైన ఉత్పత్తులపై ప్రస్తుత సుంకాలే అమలవుతాయి. వీటిలో ఉక్కు, రాగి, కొన్ని రకాల ఆటోమొబైల్ విడి భాగాలున్నాయి. అన్ని దేశాలపైనా ఈ మూడింటిపై 50శాతం సుంకాలు అమలవుతున్నాయి. దీంతో వాటిలో మార్పులేదు.

సుంకాలు తగ్గే భారత ఉత్పత్తులు..

టెక్స్‌టైల్, అప్పారెల్, తోలు ఉత్పత్తులు, ప్లాస్టిక్‌లు, రబ్బర్, ఆర్గానిక్ కెమికల్స్, కళాకృతులు, పాదరక్షలు, ఆభరణాలు, యంత్ర విడి భాగాలు, బొమ్మలు, హోం డెకార్, స్మార్ట్ ఫోన్లు, వ్యవసాయ ఉత్పత్తులు.

రత్నాలు, వజ్రాలు, జనరిక్ ఔషధాలు, విమాన విడి భాగాలు, ఆటోమొబైల్ విడి భాగాలపై సున్నా సుంకాలు.

మసాలాలు, టీ, కాఫీ పౌడర్లు, కోప్రా, కొబ్బరి నూనె, పోక చెక్కలు, జీడి పప్పు, బ్రెజిల్ నట్, చెస్ట్‌నట్, అవకాడో, అరటి, జామ, మామిడి, కివీ, బొప్పాయి, పైనాపిల్, పుట్టగొడుగులు, కూరగాయల సాగు పరికరాలు, టారో, బార్లీ, కానరీ విత్తనాలు, బేకరీ, కొకోవా, కొకోవా ఉత్పత్తులు, నువ్వులు, గసగసాలు, పండ్ల జామ్‌లు.. పేస్ట్‌లు.

అమెరికా ఉత్పత్తులు..

డేటా సెంటర్లకు, ఏఐకి ఉపయోగపడే పరికరాలు, అత్యున్నత నాణ్యత కలిగిన చిప్‌లు, ఐసీటీ గూడ్స్, యంత్రాలు.

వైన్స్, ఆల్కహాల్ ఉత్పత్తులు, వాల్‌నట్స్, బాదం, పిస్తా, బీన్స్.

హైఎండ్ కార్లు, మోటారు సైకిళ్లు, విమానాలు.

గుండె, న్యూరో, డయాబెటిస్ సంబంధిత ఔషధాలు, కాస్మెటిక్స్, వైద్య పరికరాలు, ఎక్స్‌రే వాల్వులు, డయాగ్నస్టిక్ పరీక్షల్లో వాడేవి, పేస్ మేకర్లు, హియరింగ్ ఎయిడ్లు, కృత్రిమ జాయింట్లు, ఇమేజింగ్ ఉపకరణాలు.



# నెహ్రూ వల్లే చైనా చేతిలో ఓడిపోయాం



హెండెర్సన్ బ్రూక్స్‌భగత్' నివేదిక దేశ రక్షణతో ముడిపడిన సున్నితమైన అంశమైనందున, దాన్ని తాము రాజకీయ అస్త్రంగా వినియోగించలేదన్నారు. ఈ మేరకు రిజిజు ఒక ట్వీట్ చేశారు. 2024 నవంబరు 1న ఎక్స్ వేదికగా తాను చేసిన ఒక ట్వీట్‌ను ఆయన ఇప్పుడు మళ్లీ షేర్ చేశారు.

--ఏమిటీ 'హెండెర్సన్ బ్రూక్స్‌భగత్' నివేదిక?

థామస్ బ్రియాన్ హెండెర్సన్ బ్రూక్స్ 1909లో బర్మాలో జన్మించారు. 1929 నుంచి 1947 వరకు భారత్‌లోని బ్రిటీష్ ప్రభుత్వ సైన్యంలో అధికారిగా పనిచేశారు. స్వాతంత్ర్యానంతరం 1964 వరకు భారత ఆర్మీలో సేవలు అందించారు. భారత ఆర్మీ బ్రిగేడియర్ పీఎస్ భగత్, థామస్ బ్రియాన్ హెండెర్సన్ బ్రూక్స్‌లతో కూడిన దర్యాప్తు బృందం.. 1962 భారత్‌చైనా యుద్ధంపై సమీక్షా నివేదికను రూపొందించింది. దీన్నే 'హెండెర్సన్ బ్రూక్స్‌భగత్' నివేదిక అంటారు.

# కేంద్రం చర్యల వల్లే బస్తర్‌లో అభివృద్ధి: ద్రౌపదీ ముర్ము



ఈ కబురు, జగదల్‌పుర్: మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాత్మక చర్యల వల్లే ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో భయం, అపనమ్మకం తొలగిపోయాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వ్యాఖ్యానించారు. జిల్లాలోని జగదల్‌పుర్‌లో మూడు రోజుల పాటు జరిగే బస్తర్ పండుమ్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. ''సహజ సౌందర్యం, సాంస్కృతిక సంపద కలిగిన బస్తర్.. నక్సలిజం ముప్పు కారణంగా ఎన్నో ఏళ్లు నష్టపోయింది. అత్యధికంగా నష్టపోయిన వారిలో యువత, గిరిజనులు, దళితులు ఉన్నారు. మావోయిస్టులతో సంబంధం ఉన్న చాలామంది హింసను విడిచిపెడుతున్నారు. పెద్ద సంఖ్యలో లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం పునరావాసం కల్పిస్తోంది. హింసను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలోకి తిరిగి వచ్చిన వారిని నేను స్వాగతిస్తున్నా. మీరంతా రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉంచండి. ఒడిశాలోని చిన్న గ్రామం నుంచి వచ్చిన ఓ గిరిజన మహిళ ఈ రోజు మీ ముందు రాష్ట్రపతిగా మాట్లాడుతుండమే భారత ప్రజాస్వామ్య బలానికి నిదర్శనం. బస్తర్‌లో అభివృద్ధి జరుగుతోంది. విద్య, రోడ్లు, మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. సమాజంలోని పేద, అణగారిన, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది'' అని ద్రౌపదీ వ్యాఖ్యానించారు.

# రష్యాలో కత్తిపోట్ల కలకలం.. నలుగురు భారతీయ విద్యార్థులకు గాయాలు



రష్యాలో కత్తిపోట్లు కలకలం రేపాయి. ఈ ఘటనలో నలుగురు భారతీయ విద్యార్థులు సహా పలువురికి గాయాలయ్యాయి. ఇందులో ఇద్దరు పోలీసు అధికారులూ ఉన్నట్లు సమాచారం. బాష్కోర్తోస్థాన్ రిపబ్లిక్‌లోని ఓ యూనివర్సిటీ విద్యార్థుల హాస్టల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘాతుకానికి పాల్పడిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాష్కోర్తోస్థాన్ రిపబ్లిక్‌లోని యూఫాలో ఉన్న స్టేట్ మెడికల్ యూనివర్సిటీ హాస్టల్‌లోకి ఓ యువకుడు కత్తితో ప్రవేశించి అక్కడున్న విద్యార్థులపై దాడికి తెగబడ్డాడు. అరెస్టు చేసేందుకు ప్రయత్నించిన పోలీసులపైనా దాడి చేశాడు. ఈ క్రమంలో నిందితుడు కూడా తనను తాను కత్తితో గాయపర్చుకున్నట్టు అంతర్గత వ్యవహారాల శాఖ వెల్లడించింది. క్షతగాత్రులతోపాటు అతడిని కూడా స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు.

స్పందించిన భారత ఎంబసీ

ఈ ఘటనపై రష్యాలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. బాధితుల్లో నలుగురు భారతీయ విద్యార్థులు ఉన్నట్లు ట్వీట్ చేసింది. ఈ వ్యవహారంపై స్థానిక అధికారులతో టచ్‌లో ఉన్నట్లు తెలిపింది. కజాన్‌లోని భారత కాన్సులేట్ అధికారులు యూనివర్సిటీకి బయల్దేరారని, బాధిత విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తారని వెల్లడించింది.

# ఓటరు నమోదు కేసు రాజకీయ ప్రేరేపితం

దిల్లీ: భారత పౌరసత్వం 1983లో తీసుకోవడానికి మూడేళ్ల ముందే ఓటరు జాబితాలో తన పేరును చేర్చారంటూ దాఖలైన కేసు రాజకీయ ప్రేరేపితమైనదని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ శనివారం దిల్లీ కోర్టుకు తెలిపారు. ఆ పిటిషన్‌లోని ఆరోపణలు నిరాధారమైనవి, దురుద్దేశాలతో కూడినవి, న్యాయ ప్రక్రియను దుర్వినియోగపరిచేవని పేర్కొన్నారు. సోనియా ప్రతిస్పందనను ఆమె తరపు న్యాయవాదులు.. ప్రత్యేక జడ్జి విశాల్ గొగ్నేకి సమర్పించారు. పౌరసత్వం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, ఓటరు జాబితా విషయం ఎన్నికల సంఘం విశేషాధికారాలకు సంబంధించినదని వివరించారు. సోనియాపై ఆరోపణలకు సరైన ఆధారాలు లేవంటూ మేజిస్ట్రేట్ కోర్టు గతంలో ఈ కేసును కొట్టివేసిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం కేసు విచారణ ఈ నెల 21వ తేదీకి వాయిదాపడింది.



# ట్రేడ్‌డీల్‌తో రైతులకు నష్టం ఉండదు .. పీయూష్ గోయల్



అమెరికాతో ట్రేడ్ డీల్ వల్ల భారత రైతులకు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఎటువంటి నష్టం ఉండదని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌స్పష్టం చేశారు. కొన్ని రంగాల్లో సున్నాశాతం సుంకాలు పోటీతత్వాన్ని పెంచుతాయన్నారు. అమెరికాకు ఎగుమతయ్యే అనేక ఉత్పత్తులపై అసలు సుంకాలే ఉండవన్నారు. అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం పై ఆయన మీడియాతో మాట్లాడారు. ''అమెరికాకు ఎగుమతయ్యే అనేక వస్తువులపై సుంకాలు ఉండవు. రత్నాలు, వజ్రాలు, దాదాపు 13 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు, స్మార్ట్‌ఫోన్‌లు సహా అనేక వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపైనా సుంకాలు లేవు. సుగంధ ద్రవ్యాలు, టీ, కాఫీ, కొబ్బరి, జీడిపప్పు, కూరగాయలు, మామిడి, అరటి, జామ, బొప్పాయి, కివీ వంటి పండ్లు ఈ జాబితాలో ఉన్నాయి. మన దగ్గర్నుంచి ఎగుమతయ్యే వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు 50శాతం నుంచి సున్నాకు తగ్గుతాయి. సేంద్రీయ ఎరువులు, అలంకరణ సామగ్రి, యంత్రాల ఎగుమతులకు గొప్ప అవకాశం. మేక్ ఇన్ ఇండియా బలోపేతానికే కొన్నింటిపై సుంకాలను సున్నా శాతానికి తీసుకొచ్చాం. అమెరికాతో ఒప్పందం ద్వారా భారత్‌కు గణనీయమైన లాభాలు ఉన్నాయి. వ్యవసాయ, డెయిరీ ఉత్పత్తులకు ఈ ఒప్పందంలో పూర్తి రక్షణ కల్పించాం'' అని తెలిపారు.

## రూ.20వేలు పెరిగిన వెండి.. అదేబాటలో పుత్తడి



దేశీయ విపణిలో బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. క్రితం రోజుతో పోలిస్తే.. కిలో వెండి ధర శనివారం రూ.20వేల మేర ఎగబాకింది. హైదరాబాద్ మార్కెట్‌లో శనివారం 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.1,61,150 పలికింది. ముందురోజు ధరతో పోలిస్తే రూ.3,150 పెరిగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,550గా ఉంది. శుక్రవారం కిలో వెండి రూ.2,60,000 పలకగా.. నేడు రూ.2,80,000కు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు కూడా పెరిగాయి. ఔన్సు పసిడి ధర 4,965 డాలర్లు, ఔన్సు వెండి ధర 77.08 డాలర్లుగా కొనసాగుతోంది.

## ఎస్‌ఎంఎస్ ఫార్మా ఆదాయం రూ.214 కోట్లు

ఎస్‌ఎంఎస్ ఫార్మాస్యూటికల్స్ 202526 డిసెంబరు 31తో ముగిసిన మూడో త్రైమాసికానికి రూ.214.20 కోట్ల ఆదాయంపై, రూ.23.47 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. త్రైమాసిక ఈపీఎస్ రూ.2.59కు చేరింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో ఆదాయం రూ.175.48 కోట్లు, నికర లాభం రూ.18.24 కోట్లుగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల కాలానికి కంపెనీ ఆదాయం రూ.654.70 కోట్లు, నికర లాభం రూ.69.28 కోట్లుగా ఉన్నాయి. కంపెనీ తన అనుబంధ సంస్థ ఎస్‌ఎంఎస్ పెప్టైడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఈక్విటీ షేర్ల రూపంలో అదనంగా రూ.7 కోట్ల వరకూ పెట్టుబడి పెట్టేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. డిసెంబరులో కొత్తగా ఎస్‌ఎంఎస్ కోల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

## కరూర్ వైశ్యా బ్యాంక్ 900వ శాఖ ప్రారంభం

దేశవ్యాప్తంగా తన శాఖల విస్తరణలో మరో మైలురాయిని కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) అందుకుంది. చెన్నైలోని తొండియార్‌పేట్ వద్ద 900వ శాఖను బ్యాంకు మేనేజింగ్ డైరెక్టరు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి రమేశ్ బాబు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు ఆరోగ్య, కుటుంబ సంరక్షణ విభాగం అదనపు కార్యదర్శి ఎస్ ఉమతో పాటు బ్యాంకుకు చెందిన కొందరు ఉన్నతాధికార్లు పాల్గొన్నారు. 'నమ్మకం అనే పునాది మీద పలు తరాల వినియోగదార్లతో బంధాన్ని కొనసాగిస్తూ కేవీబీ వృద్ధి చెందుతోంది. సాంకేతికత, ఆధునిక బ్యాంకింగ్ సొల్యూషన్లను అందిపుచ్చుకుంటూనే.. అందరికీ బ్యాంకింగ్ సేవలను దరిచేర్చడంపై మా దృష్టిని కొనసాగిస్తున్నామ'ని రమేశ్ బాబు తెలిపారు. 2025 డిసెంబరు 31నాటికి కేవీబీ మొత్తం టర్నోవరు రూ.2.11 లక్షల కోట్లుగా నమోదైంది. 2025 అక్టోబరు డిసెంబరులో రూ.690 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

## హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్ 200%డివిడెండ్

పారిశ్రామిక బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్ తయారీలో నిమగ్నమైన హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. సంస్థ ఆదాయం రూ.884.58 కోట్లు, నికర లాభం రూ.217.56 కోట్లు, ఈపీఎస్ రూ. 7.95గా నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.452.10 కోట్లు, నికర లాభం రూ.58.39 కోట్లు, ఈపీఎస్ రూ.2.31 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే, సమీక్షా త్రైమాసికంలో ఆదాయం 95.6 శాతం, నికర లాభం 272.6 శాతం చొప్పున వృద్ధి చెందాయి. మొత్తం 9 నెలల కాలానికి ఆదాయం రూ.2,744.67 కోట్లు, నికర లాభం రూ.746.07 కోట్లుగా ఉన్నాయి. రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి ఈక్విటీ షేరుపై రూ.2 (200%) మధ్యంతర డివిడెండ్‌ను బోర్డు ఆమోదించింది. ఇందు కోసం ఫిబ్రవరి 13ను రికార్డు తేదీగా నిర్ణయించారు. కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో సంయుక్త సంస్థ(జేవీ) ఏర్పాటు, బెంగళూరుకు చెందిన అంకుర సంస్థ యానంద్రియ ప్రైవేట్ లిమిటెడ్, కొచ్చికి చెందిన జాల్టెన్ సిస్టమ్స్‌లో ఈక్విటీ పెట్టుబడులు పెట్టేందుకూ బోర్డు ఆమోదం తెలిపింది.

# బిగ్‌బైక్స్ పై జీరో ట్యాక్స్.. తగ్గనున్న హార్లే డేవిడ్ సన్ ధరలు



భారత్ అమెరికా మధ్య ఎట్టకేలకు మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా అమెరికన్ మోటార్ సైకిళ్లపై భారీగా సుంకాలను భారత్ తగ్గించింది. 8001600 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన మోటార్ సైకిళ్లపై ఎలాంటి సుంకాలు ఉండబోవని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా అమెరికాకు చెందిన ప్రీమియం బైక్ తయారీ కంపెనీ హార్లేడేవిడ్‌సన్‌కు (Harley Davidson) ఈ డీల్ ద్వారా ఊరట లభించనుంది. హార్లే డేవిడ్‌సన్‌కు గతంలోనూ ప్రభుత్వం ఊరట కల్పించింది. 1600 సీసీ వరకు ఇంజిన్ సామర్థ్యం కలిగిన వాహన దిగుమతులపై 50 శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని గతేడాది 40 శాతానికి తగ్గించింది. 1600 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం కలిగిన వాహనాలపై 50 శాతం సుంకాన్ని 30 శాతానికి కుదించింది. ఈ నేపథ్యంలో మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. దీనిపై మార్చిలో సంతకాలు జరగనున్నాయి.

ఒప్పందం అమలు తేదీ నుంచి కొత్త సుంకాలు అమల్లోకి రానున్నాయి.అమెరికా నుంచి దిగుమతయ్యే కార్లపైనా సుంకాలను భారత్ తగ్గించింది. 3000 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన పెట్రోల్, డీజిల్ వాహనాలపై 10 ఏళ్ల పాటు 30శాతం చొప్పున టారిఫ్ వర్తిస్తుంది. ఎలక్ట్రిక్ కార్లను ఈ ట్రేడ్ డీల్ నుంచి మినహాయించారు. అంటే టెస్లాకు ఈ సారికి ఊరట లభించనట్లే లెక్క. టెస్లా విక్రయిస్తున్న మోడల్ వై కార్లపై టారిఫ్‌లు యథాతథంగా కొనసాగనున్నాయి. దేశీయ కార్ల కంపెనీలైన టాటా, మహీంద్రాకు ఇది ఊరట కల్పించే విషయం

# అదరగొట్టిన SBI.. నికర లాభం రూ.21,317 కోట్లు




ప్రభుత్వరంగ బ్యాంక్ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (State bank of India) త్రైమాసిక ఫలితాల్లో అదరగొట్టింది. 202526 ఆర్థిక సంవత్సరం అక్టోబర్ డిసెంబర్ త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.21,317 కోట్ల నికర లాభాన్ని బ్యాంక్ ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.18,853 కోట్ల నికర లాభంతో పోలిస్తే 13.06 శాతం వృద్ధి నమోదైంది.స్టాండలోన్ ప్రాతిపదికన బ్యాంక్ లాభంలో 24 శాతం వృద్ధి నమోదైంది. గతేడాది రూ.16,891.44 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ ఏడాది రూ.21,028.15 కోట్లకు చేరింది. ఎస్‌బీఐకి ఇప్పటి వరకు ఇదే అత్యధిక లాభం కావడం గమనార్హం. రుణాల్లో మెరుగైన వృద్ధి నమోదు కావడంతో నికర లాభం భారీ స్థాయిలో పెరిగింది. స్టాండలోన్ ప్రాతిపదికన బ్యాంక్ మొత్తం ఆదాయం 9.7 శాతం వృద్ధితో రూ.1,28,467.39 కోట్ల నుంచి రూ.1,40,914.65 కోట్లకు పెరిగింది. మొత్తంగా ఖర్చులు 1,04,917 కోట్ల నుంచి రూ.1,08,052 కోట్లకు చేరాయి.2025 డిసెంబర్ 31 నాటికి స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి (NPA) మొత్తం రుణాల్లో 1.57 శాతంగా ఉంది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఈ మొత్తం 1.743 శాతంగా ఉంది. ప్రొవిజన్లు రూ.911 కోట్ల నుంచి రూ.4,507 కోట్లకు పెరిగినట్లు ఎస్‌బీఐ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది.

# ఆస్ట్రేలియా మార్కెట్లోకి రిలయన్స్.. గుడ్‌నెస్ గ్రూప్‌లో మెజారిటీ వాటా




కాంపాతో దేశీయ శీతలపానీయాల మార్కెట్‌లోకి ఎంట్రీ ఇచ్చిన రిలయన్స్.. కొత్త మార్కెట్లలోకీ ప్రవేశిస్తోంది. ఇందులో భాగంగా ఆస్ట్రేలియాకు చెందిన గుడ్‌నెస్ గ్రూప్ గ్లోబల్ (GGG) పీటీవై లిమిటెడ్‌లో రిలయన్స్‌కు చెందిన ఎఫ్‌ఎంసీజీ విభాగం రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (RCPL) మెజారిటీ వాటా దక్కించుకుంది. జీజీజీ గ్రూప్‌నకు చెందిన బెటర్ ఫర్ యూ బేవరేజెస్ వ్యాపారాన్ని దక్కించుకోవడం ద్వారా ఆస్ట్రేలియా మార్కెట్‌లోకీ ఎంట్రీ ఇవ్వనుంది. ఈ వ్యూహాత్మక ఒప్పందంలో భాగంగా గుడ్‌నెస్ గ్రూప్‌నకు చెందిన హెల్త్ డ్రింక్ నెక్స్‌బా (Nexba), ఆస్ట్రేలియన్ క్రికెటర్ ప్యాట్ కమిన్స్‌తో కలిసి రూపొందించిన పేస్ (PACE) హైడ్రేషన్ బ్రాండ్‌ను భారత్‌కు రిలయన్స్ పరిచయం చేయనుంది. ఈ డీల్‌కు సంబంధించి ఆర్థిక వివరాలేవీ వెల్లడికాలేదు. భారత్ సహా ప్రపంచ దేశాల్లో ఎఫ్‌ఎంసీజీ ప్లేయర్‌గా అవతరించాలన్న రిలయన్స్ లక్ష్యాన్ని ఈ డీల్ ద్వారా మరింత బలోపేతం చేయనుంది. ప్రస్తుతం హెల్తీ బేవరేజెస్‌లో రస్‌కిక్, సన్‌కిక్ జ్యూస్‌లతో పాటు జీరో సుగర్ కార్బోనేటెడ్ సాఫ్ట్ డ్రింక్స్‌ను రిలయన్స్ యూఏఈ, ఖతార్, ఒమన్, బహ్రెయిన్, నేపాల్, శ్రీలంక వంటి దేశాల్లో విక్రయిస్తోంది. తన సాఫ్ట్ డ్రింక్ బ్రాండ్ కాంపాను కూడా మరిన్ని మార్కెట్‌లకు పరిచయం చేస్తోంది. రిలయన్స్‌కు ఉన్న సప్లయ్ చైన్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ సాయంతో గుడ్‌నెస్ గ్రూప్ గ్లోబ్‌కు చెందిన సాఫ్ట్ డ్రింకులను కూడా భారత్ సహా ఇతర కొత్త మార్కెట్లకు విస్తరిస్తామని ఆర్‌సీపీఎల్ డైరెక్టర్ టీ కృష్ణ కుమార్ పేర్కొన్నారు. సిడ్నీకి చెందిన గుడ్‌నెస్ గ్రూప్ ఆస్ట్రేలియా సహా 21 మార్కెట్లలో శీతల పానీయాలను విక్రయిస్తోంది.

# కొత్త ఐటీ చట్టం ముసాయిదా నిబంధనలు, ఫారంల విడుదల

## అభిప్రాయాలకు ఫిబ్రవరి 22 వరకు గడువు




కొత్త ఆదాయపు పన్ను చట్టం2025 కింద ముసాయిదా నిబంధనలు, ఫారంలను ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం శనివారం విడుదల చేసింది. ఆరు దశాబ్దాల పాత ఆదాయపు పన్ను చట్టం 1961 స్థానంలో.. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న సంగతి తెలిసిందే.ః నిబంధనల భారాన్ని తగ్గించడంతో పాటు, పన్ను చెల్లింపుదార్లు సులువుగా అర్థం చేసుకునేలా నియమాలను సరళీకరించాలన్నదే దీనిని తీసుకొని రావడం వెనక ప్రభుత్వ ఉద్దేశం. కొత్త ఆదాయపు పన్ను చట్టం ముసాయిదా నిబంధనలు, ఫారంలపై ఫిబ్రవరి 22 వరకు సంబంధిత వాటాదార్లు అభిప్రాయాలను తెలియజేయొచ్చు. ఆ తర్వాత నిబంధనలను, ఫారంలను ప్రభుత్వం నోటిఫై చేస్తుంది. పాత ఆదాయపు పన్ను చట్టంలో 511 నిబంధనలు, 399 ఫారంలు ఉండగా.. కొత్త ఆదాయపు పన్ను చట్టం ముసాయిదా నిబంధనల్లో 333 నిబంధనలు, 190 ఫారంలు ఉన్నాయి. ఆటోమేటెడ్ రీకాన్సిలేషన్, ప్రీఫిల్ వెసులుబాటుతో కొత్త ఫారంలను మరింతగా సరళీకరించినట్లు ఐటీ విభాగం తెలిపింది. సులువుగా అర్థమయ్యే భాషనే ఈ ఫారంలలో వాడినట్లు తెలిపింది.

## పబ్లిక్ ఇష్యూలకూ 'వాణిజ్య ఒప్పందం' జోష్

**–ఈ వారంలో ఐపీఓకు రెండు కంపెనీలు**

**–రూ.3,800 కోట్ల నిధుల సమీకరణకు అవకాశం**




గత 1218 నెలలుగా స్టాక్ మార్కెట్ దిద్దుబాటు దిశలో సాగడంతో.. పబ్లిక్ ఇష్యూకు వచ్చే విషయంలో పలు కంపెనీలు వేచిచూసే ధోరణిని అవలంబించాయి. అంతర్జాతీయంగా అనిశ్చితులు నెలకొనడం, భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై సందిగ్ధత వల్ల ఐపీఓ సమయంపై ఒక నిర్ణయానికి రావడం వాటికి సవాలుగా మారింది. అయితే ఇప్పుడు భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం సాకారం అవుతుండటంతో అటు స్టాక్ మార్కెట్‌కే కాకుండా, ప్రైమరీ మార్కెట్‌లోనూ జోష్‌ను తీసుకొచ్చిందని విశ్లేషకులు చెబుతున్నాయి. ఈ వారంలో రెండు కంపెనీలు ఆయ్ ఫైనాన్స్, ఫ్రాక్టల్ అనలటిక్స్ పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ రెండు సంస్థలు కలిసి మొత్తంగా రూ.3,800 కోట్లను సమీకరించాలని అనుకుంటున్నాయి. అయితే మునుపు ప్రకటించిన దానితో పోలిస్తే ఈ రెండు సంస్థలు తమ ఇష్యూ పరిమాణాన్ని తగ్గించుకోవడం గమనార్హం. సూక్ష్మ రుణాల సంస్థ ఆయ్ ఫైనాన్స్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) 9న ప్రారంభమై 11న ముగియనుంది. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా రూ.1,010 కోట్లను సమీకరించాలని కంపెనీ అనుకుంటోంది. కాగా.. డిసెంబరులో ముసాయిదా పత్రాలను సమర్పించిన సమయంలో ఇష్యూ పరిమాణాన్ని రూ.1,450 కోట్లుగా పొందుపరిచింది. తాజా షేర్ల ద్వారా రూ.885 కోట్లను, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.565 కోట్లను సమీకరించనున్నట్లు ఆ సమయంలో తెలిపింది. అయితే ప్రస్తుతం తాజా షేర్ల జారీ పరిమాణాన్ని రూ.710 కోట్లకు, ఓఎఫ్‌ఎస్ ద్వారా నిధుల సమీకరణను రూ.300 కోట్లకు తగ్గించింది. ఇష్యూ ధరల శ్రేణి రూ.122129. కృత్రిమ మేధ, అనలటిక్స్ సంస్థ ఫ్రాక్టల్ అనాలటిక్స్ పబ్లిక్ ఇష్యూ కూడా 9న ప్రారంభమై 11న ముగియనుంది. ఐపీఓ ద్వారా రూ.2,834 కోట్లను సమీకరించాలని అనుకుంటోంది. ఈ సంస్థ కూడా తాజా షేర్ల జారీ ద్వారా నిధుల సమీకరణను రూ.1,279 కోట్ల నుంచి రూ.1,024 కోట్లకు తగ్గించింది. ఓఎఫ్‌ఎస్‌లో విక్రయించనున్న షేర్ల విలువను కూడా రూ.3,621 కోట్ల నుంచి తగ్గించి రూ.1,810 కోట్లకు పరిమితం చేసింది. ఇష్యూ ధరల శ్రేణి రూ.857900.

## సాఫీగానే రూ.17.2 లక్షల కోట్ల రుణ సమీకరణ

**–ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అనురాధ**




వచ్చే ఆర్థిక సంవత్సరానికి (202627) ప్రభుత్వం తీసుకునే రూ.17.2 లక్షల కోట్ల రుణాలు సాఫీగానే పూర్తవుతాయని, ప్రైవేటు రంగానికి తగినన్ని నిధులు కూడా అందుబాటులో ఉన్నాయని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అనురాధ ఠాకూర్ వెల్లడించారు. ప్రభుత్వ రుణ కార్యక్రమంలో తిరిగి చెల్లించడానికి రూ.5.5 లక్షల కోట్లు కూడా ఉన్నాయి. దీంతో నికర రుణాలు రూ.11.73 లక్షల కోట్లు అవుతాయని, ఇవి గతంలో ఉన్న పరిధిలోనే ఉన్నాయని పేర్కొన్నారు. జాగ్రత్తగా లెక్కలు విశ్లేషించిన తర్వాత ఈ స్థాయిలో రుణాలు సమీకరించాలనుకున్నామన్నారు. 202526 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాల్లో రూ.14.82 లక్షల కోట్ల రుణాలు సమీకరించాలనుకోగా, ప్రభుత్వం దీన్ని రూ.14.61 లక్షల కోట్లకు సవరించింది. ఆర్థిక లోటును భర్తీ చేసుకోవడానికి డేటెడ్ సెక్యూరిటీల ద్వారా మార్కెట్ నుంచి ప్రభుత్వం అప్పు తీసుకుంటుంది. ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధులు (ఏఐఎఫ్‌లు), పరిశ్రమలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న గిరాకీని ఈ బడ్జెట్‌లో తీర్చినట్లు ఆమె వెల్లడించారు. ఎల్‌ఎల్‌పీ చట్టాన్ని సవరించగలిగితే.. ఏఐఎఫ్‌ల క్రియాత్మక అవసరాలకు అనుగుణంగా మార్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ సవరణలు తరచుగా ట్రస్టులుగా పని చేసే ఏఐఎఫ్‌లు ఎదుర్కొంటున్న కార్యాచరణ అడ్డంకులను తొలగించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

## మొదలయ్యేది... మార్చి నుంచే!




విజయోత్సాహంలో ఉన్న చిరంజీవి పెద్దగా విరామం తీసుకోకుండానే కొత్త సినిమా కోసం రంగంలోకి దిగనున్నారు. మార్చి నుంచే ఆ చిత్రం షురూ కానుంది. ఆ మేరకు చిత్రబృందం ప్రణాళికలు రచించినట్టు తెలుస్తోంది. సంక్రాంతికి 'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమాతో ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు చిరంజీవి. ఆ సినిమా సెట్స్‌పై ఉండగానే, బాబీ కొల్లి దర్శకత్వంలో సినిమా చేయడానికి పచ్చజెండా ఊపారు. ఇప్పటికే పూర్వ నిర్మాణ పనులన్నీ పూర్తి చేసిన బాబీ... వెంటనే సినిమాని పట్టాలెక్కించేందుకు సిద్ధమయ్యారు. తండ్రి, కూతురు కథతో ఆ చిత్రం రూపొందనున్నట్టు సమాచారం. కూతురు పాత్ర కోసం కృతిశెట్టి పేరు ప్రచారంలోకి వచ్చినా, తాజాగా సారా అర్జున్‌ని ఎంపిక చేశారని సమాచారం. ఇందులో ఇద్దరు కథానాయికలకు చోటుందని తెలిసింది. ఇప్పటికే ఓ సీనియర్ హీరోయిన్ పాత్ర పేరు ప్రచారంలోకి వచ్చింది. మరొక హీరోయిన్ ఎంపికపై చిత్రబృందం కసరత్తులు చేస్తోంది. 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి బాబీ కలయికలో రూపొందుతున్న చిత్రమిది.

## 'మిస్సింగ్' వార్తల ప్రచార ఆరోపణలు.. స్పందించిన 'మర్దానీ 3' చిత్ర బృందం



దిల్లీలో మిస్సింగ్ ఘటనలపై కొంతమంది కావాలనే అతిగా ప్రచారం చేస్తున్నారని దిల్లీ పోలీసులు పోస్ట్ పెట్టిన విషయం తెలిసిందే. తాజాగా ఈ అంశంపై 'మర్దానీ 3' (Mardaani 3) టీమ్ స్పందించింది. ఈ సినిమా ప్రచారం కోసమే మిస్సింగ్ పోస్ట్‌లు చేశారంటూ వస్తోన్న ఆరోపణలను చిత్రనిర్మాణ సంస్థ కొట్టేసింది. ఈమేరకు యశ్‌రాజ్ ఫిల్మ్స్ ఓ ప్రకటనను విడుదల చేసింది. ''యశ్ రాజ్ ఫిల్మ్స్‌కు 50 ఏళ్ల చరిత్ర ఉంది. నైతికతకు అధిక ప్రాధాన్యమిస్తూ ముందుకుసాగుతోంది. దిల్లీలో మిస్సింగ్ కేసులను 'మర్దానీ 3' టీమ్ ప్రచారం కోసం ఉపయోగించుకుంటోందనే వార్తల్లో వాస్తవం లేదు. మేం ఆ ఆరోపణలను ఖండిస్తున్నాం. సినిమా ప్రచారం కోసం ఇలాంటి సున్నితమైన అంశాలను ఉపయోగించుకోలేం. అందరూ దీన్ని గమనించాలి'' అని తెలిపారు. ఇక ఈ సినిమా కథ గురించి కూడా నిర్మాణ సంస్థ ఒక విషయాన్ని వెల్లడించింది. ఒక నిర్దిష్ట కాలంలో 9 ఏళ్ల వయసున్నవారు ఎలా మిస్ అయ్యారు అనే అంశంతోనే ఈ సినిమా రూపొందినట్లు తెలిపింది. మహిళల అక్రమ రవాణా, కిడ్నాప్.. తదితర అంశాలతో రూపొంది మంచి విజయాన్ని అందుకున్నాయి 'మర్దానీ', 'మర్దానీ 2' చిత్రాలు. ఈ రెండూ భారీ హిట్ కావడంతో ఈ ఫ్రాంచైజీలో మూడో చిత్రాన్ని రూపొందించారు. ఇందులో రాణి ముఖర్జీ.. శివానీ శివాజీరాయ్ అనే పోలీసు పాత్రలో కనిపించారు. జనవరి 30న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకువచ్చింది.

## 'రిటైర్మెంట్'ని తప్పుగా అర్థం చేసుకున్నారు ..విక్రాంత్ మాస్సే



'ట్వెల్త్ ఫెయిల్'తో దేశం దృష్టిని ఆకర్షించిన యువ కథానాయకుడు విక్రాంత్ మాస్సే గతంలో నటనకు కొన్ని నెలలు విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై ఎన్నో వార్తలు ప్రచారమయ్యాయి. అయితే తన రిటైర్మెంట్‌ను అందరూ తప్పుగా అర్థం చేసుకున్నారని ఆయన తాజాగా వెల్లడించారు. ''నేను చెప్పాలనుకుంటున్న విషయాన్ని తక్కువ పదాలలో చెప్పేసరికి అందరూ దాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు. నేను విరామం తీసుకుందామనుకున్నాను. కానీ, శాశ్వతంగా నటనకు దూరమవుతానని చెప్పలేదు. ఆ సమయంలో నేను తీవ్ర ఒత్తిడిలో ఉన్నా. అందుకే కొన్ని రోజులు విరామం ప్రకటించా. అందరూ నేను ఇండస్ట్రీకి శాశ్వతంగా దూరమవుతానని భావించారు. అసలు కారణం మాత్రం ఎవరూ అడగలేదు. రోజులో 14, 16 గంటలు పని చేయడం చాలా కష్టంగా అనిపించింది. వరుస ప్రాజెక్ట్‌లతో అలసిపోయాను. అందుకే బ్రేక్ ఇచ్చాను. ఆ సమయంలో నేను చేసిన సినిమాలన్నీ మంచి విజయం సాధించాయి. సినిమాలు హిట్ అవుతున్నప్పటికీ ఏడాది 4 చిత్రాలు చేయడం కష్టమే'' అని విక్రాంత్ మాస్సే అన్నారు.సీరియల్స్‌తో కెరీర్ ప్రారంభించారు విక్రాంత్ మాస్సే. 2024 చివర్లో రిటైర్మెంట్ గురించి పోస్ట్ పెట్టారు. కుటుంబసభ్యులకు పూర్తి సమయాన్ని కేటాయించాల్సిన టైమ్ వచ్చిందని.. కొత్త సినిమాలను ఇక అంగీకరించడం లేదని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. 7 నెలల అనంతరం ఆయన ప్రాజెక్ట్‌లు అంగీకరించారు.

## రాజమౌళి మరో ట్విస్ట్.. 'వారణాసి' మొత్తం ఐమ్యాక్స్ ఫార్మాట్ కాదట!

'వారణాసి' (Varanasi) మూవీ మొత్తం ట్రూ ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో ఉండదని, కేవలం కీలక సన్నివేశాల్లో మాత్రమే ఆ అనుభూతిని ఆస్వాదిస్తారని దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి తెలిపారు. ఆయన దర్శకత్వంలో మహేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. ప్రియాంక చోప్రా కథానాయిక. పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ మూవీ 2027 ఏప్రిల్ 7న (Varanasi Release Date) విడుదల కానుంది. అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సినిమా మేకింగ్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ''మా దగ్గర ఉన్న సినిమా స్క్రీన్‌లన్నీ స్కోప్‌లోనే ఉంటాయి. మా ప్రేక్షకులు ఎక్కువగా ఆ థియేటర్స్‌కే వెళ్లి సినిమా చూస్తుంటారు. ఈ మూవీని ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో తీయాలనుకున్నప్పుడు నిజంగా ఇది మాకొక సవాల్ అనిపించింది. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో షూట్ చేసి సినిమా స్కోప్‌నకు తగ్గించాలా? లేక సినిమా స్కోప్‌లో తీసి ఐమ్యాక్స్ వెర్షన్‌కు ఫ్రేమ్ చేయాలా? అన్న దానిపై మా సినిమాటోగ్రాఫర్ సహా టెక్నికల్ టీమ్‌తో చాలా రోజుల పాటు చర్చ జరిగింది. దీంతో




ఈ సినిమా కోసం ఒక ఫార్ములా అనుకున్నాం. 'వారణాసి' మొత్తం సినిమా స్కోప్ 1.90:1లోనే ఉంటుంది. ఐమ్యాక్స్ స్క్రీన్‌లలో మాత్రం సినిమాలోని కీలక సన్నివేశాలు ట్రూ ఐమ్యాక్స్ ఫార్మాట్ 1:43:1లో కనిపిస్తాయి. ఎప్పుడు ఏ ఫార్మాట్ చూపించాలన్నది ఇప్పటికీ మాకొక సవాలే''

## సెట్‌లో మూడు కేరవాన్స్ అడిగాడా? అసలు విషయమిదే!

బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా నటించిన ధురంధర్ మూవీ సంచలన విజయం సాధించింది. 2025 డిసెంబర్ 5న విడుదలైన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ.1300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ఈ బ్లాక్‌బస్టర్ చిత్రానికి మూడు నెలల్లోనే సీక్వెల్ కూడా వచ్చేస్తోంది. ధురంధర్: ద రివేంజ్ మూవీ మార్చి 19న విడుదల కానుంది. మూడు కేరవాన్స్ ఇదిలా ఉంటే ధురంధర్ సినిమా సెట్‌లో రణ్‌వీర్ సింగ్ ఏకంగా మూడు కేరవాన్స్ అడిగాడని కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. తనకొక కేరవాన్, తన సిబ్బందికి మరో రెండు వానిటీ వ్యాన్స్ అడిగాడన్నది కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. అయితే ఇందులో ఏమాత్రం నిజం లేదని తెలుస్తోంది. **---అసలు నిజమిదే!....** ధురంధర్ చిత్ర నిర్మాణ సంస్థకు చెందిన ఓ వ్యక్తి మాట్లాడుతూ..బ్యాంకాక్‌లో షూట్ చేసినప్పుడు అక్కడ రెండు కార్లు ఉపయోగించాం. ఒక వానిటీ వ్యాన్ హీరోకు కాగా మిగతా కార్లు సిబ్బందికి, సామాన్లకు వాడుకున్నాం. లొకేషన్స్ మా



ర్చినప్పుడు ఈ కార్లనే వినియోగించాం. అంతే తప్ప హీరో మూడు వానిటీ వ్యాన్స్ డిమాండ్ చేశాడన్న ప్రచారంలో నిజం లేదు అని క్లారిటీ ఇచ్చాడు. అలాగే సీక్వెల్ కోసం రణ్‌వీర్ సింగ్ రోజుకు 1214 గంటల పాటు పనిచేశాడని.. దీని ఫలితంగా 1525 కిలోల మేర బరువు తగ్గాడని పేర్కొన్నాడు.

## ఫంకీ ట్రైలర్.. అనుదీప్ మార్క్ కామెడీ, పంచులు





**గతేడాది 'లైలా' సినిమాతో బొక్కబోర్లా పడ్డాడు హీరో విశ్వక్‌సేన్. ఈసారి ఎటువంటి ప్రయోగాలు చేయకుండా కామెడీ జానర్ ఎంచుకున్నాడు. జాతిరత్నాలు ఫేమ్ అనుదీప్ దర్శకత్వంలో ఫంకీ సినిమా చేశాడు. డ్రాగన్ బ్యూటీ కయాదు లోహర్ కథానాయికగా నటించింది. శనివారం (ఫిబ్రవరి 7న) ఫంకీ ట్రైలర్ రిలీజ్ చేశారు.**

**ట్రైలర్ నిండా పంచులే.... ట్రైలర్ ప్రారంభం నుంచే పంచులతో, కామెడీతో అదిరిపోయింది. మీ అమ్మకు ఆపరేషన్ చేయాలంటే నాకు రాదు డాక్టర్ అన్న డైలాగ్‌తో వీడియో మొదలైంది. ఓనర్‌కు రెంట్ కట్టుడు వంటివన్నీ నాకు గలీజ్ అనిపిస్తయ్ అంటాడు హీరో. ట్రైలర్ ముగింపు వరకు పంచులకు లోటే లేకుండా కట్ చేశారు. మొత్తానికి ట్రైలర్‌తోనే మంచి హైప్ ఇచ్చారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ మూవీ ఫిబ్రవరి 13న విడుదలవుతోంది.**

## అందాల సారా అర్జున్...



**సారా అర్జున్.. 'దురంధర్'తో హిందీ ప్రేక్షకులను పలకరించింది. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. గుణ శేఖర్ రూపొందించిన 'యుఫోరియా' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా 'సారా అర్జున్' గురించి ఆసక్తికర విషయాలు మీకోసం.. సారా పుట్టిపెరిగిందంతా ముంబయి. ఆమెది సినిమా నేపథ్యమున్న కుటుంబమే. నాన్న రాజ్ అర్జున్ నటుడు. అమ్మ సన్యా డ్యాన్స్ ఇన్‌స్ట్రక్టర్. కుటుంబంతో మాల్‌కి వెళ్లినప్పుడు అమ్మ చేతిలోని 18 నెలల సారాని చూసి ఓ యాడ్ సంస్థ ప్రతినిధులు ముగ్ధులయ్యారు. తమ ప్రకటనలో నటింపజేయమని అడిగారు. అలా తొలిసారి కెమెరా ముందుకు వచ్చింది సారా. అయిదేళ్లు వచ్చేసరికి 100 వాణిజ్య ప్రకటనల్లో మెరిసింది. తరవాత సినిమా అవకాశాలూ వచ్చాయి. తెలుగు, తమిళం, హిందీ, మలయాళ చిత్రాల్లో బాలనటిగా నటించి... అవార్డులూ అందుకుంది. ఎక్కడా చదువుని నిర్లక్ష్యం చేయలేదు సారా. సెలవుల్లోనే షూటింగ్‌ని ప్లాన్ చేసుకునేది. దేశంలోనే ఎక్కువ మొత్తం సంపాదన ఉన్న బాలనటిగానూ పేరు తెచ్చుకుంది. 'నటన అంటేనే ఎక్కువ ఆసక్తి. నిజానికి దాన్ని ఎంజాయ్ చేస్తా. అలాగని నేర్చుకోవడాన్నీ పక్కన పెట్టను అందుకే, చదువుకీ సమాన ప్రాధాన్యమిస్తా'నంటోన్నది సారా.... నాకు కొత్త ప్రదేశాలను చూడటం అంటే ఇష్టం. ఎవరిని కలిసినా బిడియం అన్నదే లేకుండా ప్రశ్నలు అడుగుతుంటా. అవే నాకు నటనా పాఠాలు. ఇప్పుడామెకు అభిమాన గణమూ పెరిగింది. ఫ్యాన్ పేజీలు వచ్చాయి. 50 వేలమంది కూడా లేని తన ఇన్‌స్టా ఖాతాకి 15 లక్షల ఫాలోవర్లు వచ్చారు. ఎక్కువ ప్రజాదరణ పొందిన భారత సెలెబ్రిటీల జాబితాని ఇంటర్నెట్ మూవీ డేటాబేస్ (ఐఎండీబీ) విడుదల చేసింది. దానిలో ప్రభాస్, విజయ్ వంటి అగ్రతారలనూ వెనక్కి నెట్టి, తొలి స్థానాన్ని దక్కించుకుంది సారా. 'నాన్న' సినిమా మొత్తం ఒకెత్తు అయితే.. క్లైమాక్స్‌లో వచ్చే కోర్టు రూమ్ సీన్స్ మరోస్థాయిలో ఉంటాయి. ఆయా సన్నివేశాలు ప్రేక్షకులతో కన్నీరు పెట్టించాయి. ఇందులో సారా - విక్రమ్ నటనకు సినీ ప్రియులు కనెక్ట్ అయ్యారు.**



## ఒకే పాత్ర.. ముంబయి నేపథ్యం



కథానాయకుడు బాలకృష్ణ.. దర్శకుడు గోపీచంద్ మలినేని కలయికలో ఓ సినిమా పట్టాలెక్కనుంది. 'వీరసింహారెడ్డి' విజయం తర్వాత ఈ ఇద్దరి కాంబోలో రూపొందనున్న కొత్త చిత్రమిది. వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. దీని కోసం తొలుత చారిత్రక కథను అనుకున్నప్పటికీ బడ్జెట్ పరిమితుల వల్ల దాన్ని పూర్తిగా పక్కకు పెట్టి సరికొత్త కథను సిద్ధం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇది ముంబయి నేపథ్యంలో సాగే స్టైలిష్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని సమాచారం. బాలయ్య గత చిత్రాల్లా కాకుండా ఆయన దీంట్లో ఒకే పాత్రలో కనిపించనున్నారని తెలిసింది. ఈ చిత్రం మార్చి తొలి వారం నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనుంది.

### ఏడు సంవత్సరాలు మంచానికే పరిమితమయ్యా: ముమైత్‌ఖాన్



'ఇప్పటికింకా నా వయసు నిండా పదహారే అంటూ..' కుర్రకారును ఉర్రూతలూగించారు డ్యాన్సర్ ముమైత్ ఖాన్. కొన్నేళ్ల పాటు వరుస సినిమాల్లో స్పెషల్ సాంగ్స్‌తో వెండి తెరపై మెరిశారు. ఆ తర్వాత అనూహ్యంగా ఇండస్ట్రీకి దూరమైన ఆమె ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్, వ్యక్తిగత విషయాల గురించి పంచుకున్నారు. ఓ ప్రమాదం కారణంగా ఏడేళ్లపాటు మంచానికే పరిమితమైనట్లు చెప్పారు. ''నా చిన్నతనంలో రోజుకు రెండు రూపాయలు ఆదా చేయడం కోసం నేను రోజుకు కొన్ని కిలోమీటర్లు నడిచి స్కూల్‌కు వెళ్లేదాన్ని. ఆ రెండు రూపాయలు దాచి మా నాన్నకు ఇచ్చేదాన్ని. 13 ఏళ్ల వయసులోనే ఇండస్ట్రీకి వచ్చాను. ఆ తర్వాత నాకు జరిగిన ప్రమాదం కారణంగా డ్యాన్స్‌కు దూరంగా ఉన్నానంతే. నేను ఇండస్ట్రీ వదిలి వెళ్లలేదు.

# రైఫిల్ విజేత ఇలవేనిల్



ఆసియా ఛాంపియన్‌షిప్ పది మీటర్ల ఎయిర్ రైఫిల్ పోటీల్లో భారత షూటర్ ఇలవేనిల్ స్వర్ణం సాధించింది. ఆమె 252.0 స్కోరుతో అగ్రస్థానం దక్కించుకుంది. మిసాకి నొబాతా (251.5, జపాన్) గట్టి పోటీ ఇచ్చినప్పటికీ.. రెండో స్థానానికే పరిమితమైంది. మరో భారత షూటర్ మేఘన సజ్జనార్ (229.5) కాంస్యంతో సరిపెట్టుకుంది. ఇలవేనిల్, ఆర్య బోర్సే, మేఘన త్రయం.. టీమ్ పోటీల్లోనూ సత్తాచాటింది. 1892.6 స్కోరుతో మొదటి స్థానంలో నిలిచి స్వర్ణం గెలిచింది.

# దక్షిణేశ్వర్ విజయం

## నెదర్లాండ్స్‌తో భారత్ పోరు 1-1తో సమం



భారత డేవిస్‌కప్ జట్టులో కీలక సభ్యుడిగా ఎదుగుతోన్న దక్షిణేశ్వర్ సురేశ్ సత్తా చాటాడు. శనివారం డేవిస్‌కప్ క్వాలిఫయర్స్ రౌండ్ 1లో అతడు డచ్ నంబర్‌వన్ ఆటగాడు జెస్పర్ డి జాంగ్‌ను ఓడించాడు. దీంతో నెదర్లాండ్స్‌తో పోరును 11తో భారత్ సమం చేసింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 465వ స్థానంలో ఉన్న దక్షిణేశ్వర్.. రెండో సింగిల్స్ మ్యాచ్‌లో నెగ్గడం ద్వారా భారత్ మరింత వెనకబడకుండా చూశాడు. తొలి సింగిల్స్‌లో సుమిత్ నగాల్ 06, 64, 36తో గై డి ఔడెన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. ఆ తర్వాత దక్షిణేశ్వర్ 64, 75తో డి జాంగ్‌పై విజయం సాధించాడు. జాంగ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 88వ స్థానంలో ఉన్నాడు.

# గ్రేడ్ బీలోకి రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ..!



వార్షిక కాంట్రాక్టుల జాబితాలో 202526 ఏడాదికి గాను బీసీసీఐ (BCCI) మార్పులు చేసినట్లు సమాచారం. రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీని ఏ+ నుంచి గ్రేడ్ బీలోకి మార్చినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సైతం బీ కేటగిరిలో ఉన్నాడు. ఏకేటగిరీలో శుభ్‌మన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా ఉన్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటికే టీ20, టెస్ట్ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. వీరు ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌లోనే కొనసాగుతున్నారు. ఇంతకుముందు వారు ఏ ప్లస్ కేటగిరీల్లో ఉన్నారు. బీసీసీఐ నుంచి ఏడాదికి వీరు రూ.7 కోట్ల వార్షిక వేతనం అందుకున్నారు. ఏ గ్రేడ్ ప్లేయర్లు రూ.5 కోట్లు, గ్రేడ్ బి ఆటగాళ్లు రూ.3 కోట్లు, గ్రేడ్ సి ప్లేయర్లు రూ.1 కోటి అందుకుంటారు. పాకిస్థాన్ తప్పకుండా యూ టర్న్ తీసుకుంటుంది: ఇర్ఫాన్ పఠాన్ అయితే ఇకపై ఏ+ కేటగిరీని పూర్తిగా తొలగించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ప్రస్తుతం కొత్త విధానంలో చెల్లింపులు ఎలా ఉంటాయనే విషయం ఇంకా తెలియాల్సిఉంది. నివేదిక ప్రకారం ఏ ఏ గ్రేడ్‌లలో ఎవరెవరు ఉన్నారంటే.. గ్రేడ్ ఏ: శుభ్‌మన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా గ్రేడ్ బి: రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య, మహ్మద్ సిరాజ్, రిషభ్ పంత్, కుల్‌దీప్ యాదవ్, యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్ గ్రేడ్ సి: అక్షర్ పటేల్, తిలక్ వర్మ, రింకు సింగ్, శివమ్ దూబె, ధ్రువ్ జురేల్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, నితీశ్ కుమార్ రెడ్డి, అభిషేక్ శర్మ, సాయి సుదర్శన్, రవి బిష్ణోయ్, రుతురాజ్ గైక్వాడ్.

# శ్రీలంక అభ్యర్థనపై ప్రభుత్వాన్ని సంప్రదించనున్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్

బంగ్లాదేశ్‌కు మద్దతుగా టీమ్‌ఇండియాతో టీ20 వరల్‌డ్‌కప్ మ్యాచ్‌ను తాము బహిష్కరిస్తున్నట్లు పాక్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని శ్రీలంక.. పాక్ క్రికెట్ బోర్డును కోరింది. ఈ విషయమై పీసీబీ (PCB) తమ ప్రభుత్వాన్ని సంప్రదించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. షెడ్యూల్ ప్రకారం పొట్టి ప్రపంచకప్‌లో గ్రూప్ స్టేజిలో ఇండియా, పాక్ ఫిబ్రవరి 15న కొలంబోలో తలపడాల్సిఉంది. అయితే పాక్.. ఈ మ్యాచ్‌ను బాయికాట్ చేస్తున్నట్లు ప్రకటించింది. టీ20 వరల్‌డ్‌కప్‌లో ఆడేందుకు పాకిస్థాన్ ప్రభుత్వం పీసీబీకి అనుమతిచ్చింది. అయితే.. భారత్‌తో మ్యాచ్‌కు మాత్రం ఒప్పుకోలేదు. ఈ హైవోల్టేజ్ మ్యాచ్ జరగకుంటే ఐసీసీ(ICC), బ్రాడ్‌కాస్టర్స్ ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. అలాగే శ్రీలంక క్రికెట్ బోర్‌డ్‌కు కూడా నష్టమే. ఈ నేపథ్యంలో భారత్‌తో మ్యాచ్ విషయంలో తాము తీసుకున్న నిర్ణయాన్ని మరోసారి సమీక్షించుకోవాలని శ్రీలంక.. పాకిస్థాన్ క్రికెట్ బోర్‌డ్‌కు లేఖ రాసింది. దీంతో ఈ విషయాన్ని పీసీబీ తమ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశముందని తెలుస్తోంది. 'శ్రీలంక బోర్డు అధ్యక్షుడు షమ్మీ సిల్వా స్వయంగా పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీని సంప్రదించారు. ఈ సమయంలో శ్రీలంకకు పాకిస్థాన్ మద్దతు అవసరమని గుర్తుచేశారు. భారత్ పాక్ మ్యాచ్‌లు లేకపోతే శ్రీలంక బోర్డు ఆదాయాన్ని కోల్పోతుందని ఆయన తెలిపారు' అని విశ్వసనీయ వర్గాల సమాచారం. పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ ఈ విషయాన్ని పాక్ ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లి, సోమవారం నాటికి ఈ విషయంపై ఓ నిర్ణయం తీసుకోనున్నారని తెలుస్తోంది.

# కెప్టెన్.. ఏం కొట్టాడయ్యా!

---సూర్య సూపర్ ఇన్నింగ్స్
–పరాభవం తప్పించుకున్న భారత్
–తొలి మ్యాచ్‌లో అమెరికాపై విజయం



టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య భారత్ శుభారంభం చేసింది. కానీ విజయం అంత తేలిగ్గా ఏమీ దక్కలేదు. మొదట అమెరికా బౌలర్లు విజృంభించడంతో భారత్ ఓటమి ముప్పును ఎదుర్కొంది. కానీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (84; 49 బంతుల్లో 10×4, 4×6) ఒత్తిడిలో వీరోచితంగా పోరాడి జట్టుకు పరాభవాన్ని తప్పించాడు. షాడ్లీ షాక్విక్ (4/24) ధాటికి ఒక దశలో 77 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన భారత్.. సూర్య పోరాటంతో 9 వికెట్లకు 161 పరుగులు చేయగలిగింది. అనంతరం హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ (3/29)తో పాటు మిగతా భారత బౌలర్లూ సత్తా చాటడంతో యుఎస్‌ఏ 8 వికెట్లకు 132 పరుగులే చేయగలిగింది. భారత్ 29 పరుగుల తేడాతో విజయాన్నందుకుంది. సూర్యకుమార్‌కే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఉదయం నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో పాకిస్థాన్ చచ్చీ చెడీ గెలవడం చూసి ఆ జట్టుపై జాలిపడి ఉంటారు భారత అభిమానులు! కానీ రాత్రి టీమ్‌ఇండియా అంతకుమించిన ఇబ్బందినే ఎదుర్కొంది. అమెరికా బౌలర్లను ఆడేసుకుంటారనుకున్న బ్యాటర్లు.. వారిని తక్కువగా అంచనా వేసి, అడ్డదిడ్డంగా షాట్లు ఆడడంతో 13 ఓవర్లకు 77/6తో నిలిచింది భారత్. అమెరికా లాంటి జట్టుపై టీమ్‌ఇండియా ఇలాంటి స్థితిలో ఉంటుందని ఎవ్వరూ ఊహించి ఉండరు! అయితే ఇంతటి ఇబ్బందికర స్థితి నుంచి పుంజుకుని 29 పరుగుల తేడాతో విజయం సాధించింది భారత్. అదంతా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అద్భుత పోరాట ఫలితమే. ప్రపంచకప్ ముంగిట లయ అందుకున్న అతను.. కెరీర్లో నిలిచిపోయే మేటి ఇన్నింగ్స్‌తో జట్టుకు పోరాడే స్కోరునందించాడు. బౌలర్లూ రాణించడంతో టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్ శుభారంభం చేయగలిగింది. టీ20 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో కఠిన సవాలు ఎదురైనప్పటికీ టీమ్‌ఇండియా కాచుకుంది. శనివారం సూర్యకుమార్ సేన 29 పరుగుల తేడాతో అమెరికాను ఓడించింది. మొదట భారత్ 9 వికెట్లకు 161 పరుగులు సాధించింది. షాడ్లీ వాన్ షాక్విక్ (4/25), హర్మీత్ సింగ్ (2/26), మహ్మద్ మోసిన్ (1/16)ల ధాటికి తీవ్రంగా తడబడ్డ భారత్‌ను 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ యాదవ్ (84 నాటౌట్; 49 బంతుల్లో 10×4, 4×6) గొప్ప ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. అనంతరం యుఎస్‌ఏ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లకు 132 పరుగులే చేయగలిగింది. అనుకోకుండా ప్రపంచకప్‌లోకి వచ్చిన మహ్మద్ సిరాజ్ (3/29)తో పాటు అర్‌ష్‌దీప్ (2/18), అక్షర్ పటేల్ (2/24), వరుణ్ చక్రవర్తి (1/24) ప్రత్యర్థిని దెబ్బ తీశారు. భారత సంతతి ఆటగాళ్లు మిలింద్ కుమార్ (34; 34 బంతుల్లో 3×4, 1×6), సంజయ్ కృష్ణమూర్తి (37; 31 బంతుల్లో 1×4, 2×6), శుభమ్ రంజానే (37; 22 బంతుల్లో 2×4, 3×6) పోరాడారు. భారత్ తన తర్వాతి మ్యాచ్‌లో గురువారం నమీబియాను ఢీకొంటుంది.

**మధ్యలో పోటీ ఇచ్చినా..:** 162 పరుగుల లక్ష్యం.. టీ20ల్లో అంత కష్టమేమీ కాదు. కానీ భారత పేస్ ద్వయం విజృంభణతో అమెరికాకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బలు తగిలాయి. హర్షిత్ రాణా దూరం కావడంతో ఒక్క రోజు ముందు ప్రపంచకప్ ఆడే అవకాశం దక్కించుకున్న సిరాజ్.. తన తొలి ఓవర్లోనే వికెట్ పడగొట్టి బౌలింగ్‌లో భారత్‌కు అదిరే ఆరంభాన్నిచ్చాడు. తన బౌలింగ్‌లో సిక్సర్ బాదిన ఆండ్రీస్ గాస్ (6)ను అతను ఔట్ చేశాడు. తర్వాతి ఓవర్లో కెప్టెన్ మోనాంక్ (0)ను అర్‌ష్‌దీప్ పెవిలియన్ చేర్చాడు. సిరాజ్ తన రెండో ఓవర్లో తెలుగు కుర్రాడు సాయితేజ (2)కు చెక్ పెట్టాడు. దీంతో 12/3తో అమెరికా పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ స్థితిలో మిలింద్, సంజయ్, శుభమ్ గట్టిగానే పోరాడారు. 15 ఓవర్లకు 98/4తో యుఎస్‌ఏ.. కాస్త పోటీలోకి వచ్చింది. అయితే తర్వాతి ఓవర్లో అక్షర్.. వరుస బంతుల్లో సంజయ్, హర్మీత్ (0)లను ఔట్ చేసి ప్రత్యర్థిని దెబ్బ కొట్టాడు. తర్వాత ఆ జట్టు క్రమంగా లక్ష్యానికి దూరమైంది.

**ఏదో అనుకుంటే..:** మొదట టాస్ గెలిచిన అమెరికా బౌలింగ్ ఎంచుకోగా, తాము టాస్ నెగ్గినా బ్యాటింగే చేసేవాళ్లం అంటూ ఉత్సాహంగా చెప్పిన టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్యకుమార్‌కు సహచరులు పెద్ద షాకే ఇచ్చారు. రెండో ఓవర్లో అభిషేక్ (0) భారీ షాట్‌కు ప్రయత్నించి.. బౌండరీ వద్ద సంజయ్ కృష్ణమూర్తికి దొరికిపోయాడు. అయితే ఇషాన్ కిషన్ (20)తో కలిసి తిలక్ వర్మ (25) నిలకడగా ఆడడంతో భారత్ పుంజుకుంది. 5 ఓవర్లకు 44/1తో నిలిచింది. కానీ షాడ్లీ షాక్విక్ వేసిన తర్వాతి ఓవర్లో భారత్‌కు మామూలు షాక్‌లు తగల్లేదు. రెండో బంతికి ఇషాన్ ఔట్ అయితే.. 5, 6 బంతులకు తిలక్, దూబె (0) ఔటైపోయారు. 69 మధ్య 4 ఓవర్లలో కేవలం 9 పరుగులే వచ్చాయి. భారత్ 9 ఓవర్లకు 53/4తో నిలిచింది. అయితే పదో ఓవర్ నుంచి సూర్య కొంచెం బ్యాట్ ఝుళిపించడంతో స్కోరు బోర్డులో కదలిక వచ్చింది. కానీ వరుస ఓవర్లలో రింకు (6), హార్దిక్ (5) ఔటైపోవడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. కానీ చివరి ఓవర్లలో సూర్యకుమార్ అసాధారణ పోరాటంతో జట్టుకు ఊహించని స్కోరు సాధించి పెట్టాడు. 17వ ఓవర్లో అక్షర్ (14) ఔటైనప్పటికీ.. సూర్య అద్భుత షాట్లతో స్కోరును 160 దాటించాడు. నేత్రావల్కర్ వేసిన చివరి ఓవర్లో తొలి నాలుగు బంతులకు అతను 4, 6, 6, 4 బాదేశాడు. చివరి 7 ఓవర్లలో 84 పరుగులొచ్చాయి.



**భారత్ ఇన్నింగ్స్:** ఇషాన్ (సి) మిలింద్ (బి) షాడ్లీ 20; అభిషేక్ (సి) సంజయ్ (బి) అలీ ఖాన్ 0; తిలక్ (సి) మోనాంక్ (బి) షాడ్లీ 25; సూర్యకుమార్ నాటౌట్ 84; దూబె (సి) సౌరభ్ (బి) షాడ్లీ 0; రింకు (సి) మిలింద్ (బి) మోసిన్ 6; హార్దిక్ (సి) సాయితేజ (బి) హర్మీత్ 5; అక్షర్ (సి) మోసిన్ (బి) హర్మీత్ 14; అర్‌ష్‌దీప్ (సి) మిలింద్ (బి) షాడ్లీ 14; వరుణ్ రనౌట్ 0; ఎక్స్‌ట్రాలు 3 మొత్తం: (20 ఓవర్లలో 9 వికెట్లకు) 161; వికెట్ల పతనం: 18, 245, 346, 446, 572, 677, 7118, 8140, 9161; బౌలింగ్: సౌరభ్ నేత్రావల్కర్ 40650; అలీ ఖాన్ 20131; షాడ్లీ షాక్విక్ 40254; మోసిన్ 40161; శుభమ్ రంజానే 20160; హర్మీత్ సింగ్ 40262

అమెరికా ఇన్నింగ్స్: ఆండ్రీస్ గాస్ (సి) తిలక్ (బి) సిరాజ్ 6; సాయితేజ (సి) వరుణ్ (బి) సిరాజ్ 2; మోనాంక్ (సి) దూబె (బి) అర్‌ష్‌దీప్ 0; మిలింద్ స్టంప్డ్ (బి) వరుణ్ 34; సంజయ్ (సి) రింకు (బి) అక్షర్ 37; శుభమ్ ఎల్బీ (బి) సిరాజ్ 37; హర్మీత్ (సి) సిరాజ్ (బి) అక్షర్ 0; మోసిన్ (సి) తిలక్ (బి) అర్‌ష్‌దీప్ 8; షాడ్లీ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 6, మొత్తం: (20 ఓవర్లలో 8 వికెట్లకు) 132; వికెట్ల పతనం: 18, 211, 313, 471, 598, 698, 7110, 8132; బౌలింగ్: అర్‌ష్‌దీప్ 40182, సిరాజ్ 40293, వరుణ్ 40241, అక్షర్ 40242, హార్దిక్ 40340

**--గాల్లో ఎగురుతూ..** భారత్, అమెరికా మ్యాచ్‌కు ముందు వాంఖడే స్టేడియంలో ప్రపంచకప్ ప్రారంభోత్సవం అభిమానులను అలరించింది. రిషబ్ శర్మ, శివమణిల పాటల సమాహారం మధ్య ప్రపంచకప్ ట్రోఫీని మైదానంలోకి తీసుకొచ్చారు. ఓ జెట్ సూట్ పైలట్ గాల్లో ఎగురుతూ ట్రోఫీని తెచ్చాడు. ఆ తర్వాత బాద్‌షా, నోరా ఫతేహి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. టోర్నమెంట్ ప్రారంభమైనట్లు ఐసీసీ ఛైర్మన్ జై షా, టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్, టీ20 ప్రపంచకప్ ప్రచారకర్త రోహిత్ శర్మ అధికారికంగా ప్రకటించారు. భారత్‌లో అమెరికా రాయబారి సెర్జియో గోర్ ప్రత్యేక అతిథిగా మ్యాచ్‌కు హాజరయ్యారు.



# వాళ్లూ మనోళ్లే.. అమెరికా జట్టులో భారత సంతతి ఆటగాళ్లు





టీ20 ప్రపంచకప్‌లో అమెరికాతో మ్యాచ్ అంటే భారత్ తేలికగా గెలిచేస్తుందనుకున్నారంతా. కానీ తీవ్రంగా తడబడి.. తర్వాత పుంజుకుని గెలిచింది. భారత్‌కు ఇంత పోటీ ఇచ్చిన జట్టులో ఉన్న మెజారిటీ ఆటగాళ్లు భారతీయులు, భారత సంతతికి చెందినవారే కావడం విశేషం. అందులో ఒకరు తెలుగు కుర్రాడే కానీ.. ఇంకో ఆరుగురికి భారత్‌తో సంబంధం ఉంది. సాయితేజ ముక్కమల్ల.. ఈ పేరు చూస్తేనే అతను తెలుగువాడని అర్థమైపోతుంది. సాయితేజ తండ్రి నాగేశ్వర్‌రెడ్డిది ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం, కమలాపురి. తండ్రి ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడడంతో సాయితేజ అక్కడే పుట్టి పెరిగాడు. క్రికెట్ శిక్షణలో భాగంగా అతను భారత్‌తో పాటు ఇంగ్లాండ్‌కు కూడా వెళ్లాడు. ఏడాది పాటు హైదరాబాద్‌లోని వీవీఎస్ లక్ష్మణ్ అకాడమీలోనే ఉన్నాడు. టీ20 లీగ్స్‌లో సత్తా చాటడంతో అతడికి అమెరికా జట్టులో చోటు దక్కింది. రెండేళ్లుగా టాప్‌ఆర్డర్లో కీలక బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు.

దిల్లీకి చెందిన మిలింద్ కుమార్.. భారత్‌లో దేశవాళీ క్రికెట్ ఆడాడు. ఈ ఆల్‌రౌండర్‌కు ఐపీఎల్ జట్టు దిల్లీ డేర్‌డెవిల్స్‌లో అవకాశం దక్కింది కూడా. కానీ మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. తర్వాత అతను అమెరికాకు వెళ్లిపోయి, జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. శుభమ్ రంజానేది మహారాష్ట్ర. అతను నాలుగేళ్ల కిందటి వరకు దేశవాళీల్లో ఆ జట్టుకు ఆడాడు. ఇక్కడ పోటీ ఎక్కువగా ఉండడంతో ఈ ఆల్‌రౌండర్ అమెరికాకు మళ్లాడు. ప్రస్తుత అమెరికా కెప్టెన్, టాప్‌ఆర్డర్ బ్యాటర్ మోనాంక్ పటేల్‌ది గుజరాత్. అండర్ 19 స్థాయి వరకు అతను గుజరాత్‌కే ప్రాతినిధ్యం వహించాడు. ఇక అమెరికా జట్టులోని స్పిన్ ఆల్‌రౌండర్ హర్మీత్ సింగ్, ఫాస్ట్‌బౌలర్ సౌరభ్ నేత్రావల్కర్‌లిద్దరూ ముంబయి వాళ్లే. మిడిలార్డర్ బ్యాటర్, స్పిన్నర్ సంజయ్ కృష్ణమూర్తి పుట్టింది, పెరిగింది అమెరికాలోనే అయినా.. అతడి మూలాలు కర్ణాటకలో ఉన్నాయి. అతను అండర్ 16 స్థాయిలో కర్ణాటకకు ఆడాడు కూడా. శనివారం మ్యాచ్ ఆడిన జట్టులో మిగతా నలుగురిలో కూడా ఒక్కరూ పక్కా అమెరికన్ కాదు. మోసిన్, అలీ ఖాన్ పాకిస్థాన్‌కు చెందిన వాళ్లు కాగా.. శాండ్లీ, ఆండ్రీస్ గాస్ దక్షిణాఫ్రికా నుంచి వచ్చి అమెరికాలో స్థిరపడ్డారు

# వింటర్ ఒలింపిక్స్ షురూ





మిలన్: వింటర్ ఒలింపిక్స్ ఇటలీలోని మిలన్‌లో ఘనంగా మొదలయ్యాయి. ఇటలీలోనే అతి పెద్ద స్టేడియమైన సాసిరోలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. పరేడ్‌లో అరిఫ్ మహ్మద్ ఖాన్ మువ్వన్నెల పతాకాన్ని చేబూని భారత బృందానికి నాయకత్వం వహించాడు. అతడు కాకుండా భారత్ నుంచి స్టాంజిన్ లండప్ మాత్రమే ఈ క్రీడల్లో పోటీపడుతున్నాడు. అల్పైన్ స్కీయింగ్‌లో అరిఫ్, క్రాస్ కంటీ స్కీయింగ్ స్టాంజిన్ అర్హత సాధించారు. మిలన్‌తో పాటు కోర్టినా డంపెజో ఈ పోటీలకు ఆతిథ్యమిస్తోంది. శీతాకాల ఒలింపిక్స్ (మిలానో కోర్టినా 2026)లో కొన్ని ఆటలు రెండు రోజుల ముందే ఆరంభమయ్యాయి. మొత్తం 16 క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి.